


ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న సి.హేమలత - ఎస్.నౌషద్ ఆలీ





నౌజియా - బి.శరశ్చంద్రశేఖర్ - మహమ్మద్ అన్వర్‌బాషా




ఎం.భాస్కర రాజు - ఎం.దొరస్వామి

ఏడుగురికి రాష్ట్రస్థాయి అవార్డులు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యా రంగంలో చేసిన సేవలకు గుర్తింపుగా జిల్లాలోని పలువురు ఉపాధ్యాయులు, అధ్యాపకులు విజయవాడ లబ్బీపేటలోని ఏ కన్వెన్షన్ సెంటర్‌లో రాష్ట్ర విద్యాశాఖ నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవాల్లో అవార్డులు అందుకున్నారు. పుంగనూరు మండలం రాంనగర్ మోడల్ ప్రైమరీ స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచర్ సి.హేమలత, గుడిపాల మండలం నరహరిపేట జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లో స్కూల్ అసిస్టెంట్ (ఫిజిక్స్) టీచర్ ఎస్.నౌషద్ ఆలీ, పుంగనూరు మండలం నక్కబండ కేజీబీవీలో స్కూల్ అసిస్టెంట్ (ఉర్దూ) టీచర్ నౌజియా, చిత్తూరు రూరల్ మండలం ఎన్ఆర్‌పేట జూనియర్ కళాశాలలో హిస్టరీ అధ్యాపకుడు బి.శరశ్చంద్రశేఖర్, కుప్పం ద్రవిడ యూనివర్శిటీ లైబ్రరీ ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగ ప్రొఫెసర్ ఎం.దొరస్వామి, చిత్తూరు పీవీకేఎన్ డిగ్రీ కళాశాల ఉర్దూ అధ్యాపకులు మహమ్మద్ అన్వర్ బాషా, నగరి డిగ్రీ కళాశాలలోని పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు ఎం.భాస్కర రాజు తదితరులు ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి లోకేశ్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు.

ఓనం సంబరాలు

కుప్పం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీఎన్ విద్యా సంస్థలకు అనుబంధమైన కుప్పం నర్సింగ్ కళాశాలలో శుక్రవారం కేరళ సంప్రదాయ పండుగ ఓనంను కళాత్మకంగా జరుపుకున్నారు. నర్సింగ్ విద్యార్థులు, అధ్యాపక బృందం కేరళ సంప్రదాయ వస్త్రధారణలో సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు. పువ్వులను ఉపయోగించి ముగ్గులను తీర్చిదిద్దారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కుప్పం ఇంజనీరింగ్ కళాశాల వైస్ ఛైర్మన్ డాక్టర్ సునీల్‌రాజ్ మాట్లాడుతూ కేరళలో అతిపెద్ద సంప్రదాయ పండుగగా ఓనంను పది రోజులపాటు జరుపుకుంటారని చెప్పారు. ఓనం పండుగ అందరి జీవితాల్లో సుఖసంతోషాలను నింపాలని ఆకాంక్షించారు. కేరళ సంప్రదాయ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విమల జోసెఫ్, కేఈసీ ప్రిన్సిపాల్ సుధాకరబాబు తదితరులు పాల్గొన్నారు.



విలువలతో కూడిన విద్యతోనే నవ సమాజ నిర్మాణం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విలువలతో కూడిన విద్యను నేర్పించి, నవ సమాజ నిర్మాణానికి బాటలు వేయడం గురువులకే సాధ్యమవుతుందని కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని విద్యాశాఖ-సమగ్రశిక్ష సంయుక్త ఆధ్వర్యంలో చిత్తూరు జడ్పీ సమావేశ మందిరంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. తొలుత రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో జరుగుతున్న పరిణామాలు పూర్తిగా పరివర్తన చెందాలంటే అది కేవలం టీచర్ల చేతుల్లోనే ఉందన్నారు.విద్యతోపాటు నైతిక విలువలు, సమాజం పట్ల గౌరవం, భక్తి, ప్రవర్తించాల్సిన తీరు నేర్పించాలని సూచించారు.ఎమ్మెల్యే జగన్మోహన్ మాట్లాడుతూ.. రాజకీయం ఏ మాత్రం తెలియని తనను ఆదరించి, ఓనమాలు నేర్పిన తన మొదటి రాజకీయ గురువు ముఖ్యమంత్రి చంద్రబాబు కాగా, పరిపాలన వ్యవస్థలో ఎలా ముందుకు వెళ్లాలని నేర్పిన గురువు కలెక్టర్ సుమిత్ కుమార్ అన్నారు. వీరిద్దరి సూచనలతోనే చిత్తూరు నగరాన్ని అభివృద్ధి పథంలో నడిపించగలుగుతున్నామన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే మురళీమోహన్ మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా నవ సమాజ నిర్మాణానికి బాటలు వేసేది గురువులేనన్నారు.మేయర్ అముద ,మొదలియార్ కార్పొరేషన్ ఛైర్మన్ త్యాగరాజన్, డీఈవో వరలక్ష్మి, సమగ్రశిక్ష ఏపీసీ వెంకటరమణ, జడ్పీ సీఈవో రవికుమార్, ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ యుగంధర్, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్, రెసిడెన్షియల్ పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ పద్మజ, డీవైఈవో ఇందిర తదితరులు పాల్గొన్నారు.


సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్, మేయర్ తదితరులు

పాతపేట వద్ద
14 ఏనుగుల హల్‌చల్

● మామిడి,కొబ్బరి చెట్లు సహా వేరుశనగ, అలసంద, అనప పంటలు ధ్వంసం




పెద్దవంక వద్ద సంచరిస్తున్న ఏనుగు - బాధిత రైతులతో మాట్లాడుతున్న రేంజర్ పట్టాభి

కల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలంలోని పాతపేట వద్ద గురువారం రాత్రి 14 ఏనుగుల గుంపు హల్‌చల్ చేసింది.ఘీంకారాలతో పొలాల్లో సంచరిస్తూ పంటలను ధ్వంసం చేశాయి. గురువారం రాత్రి తూర్పు విభాగం అటవీ ప్రాంతంలోని గోగులమ్మ వంక నుంచి బయలుదేరిన ఏనుగుల గుంపు పాతపాళ్యం అడవిమీదుగా పాతపేట వద్దకు చేరుకున్నాయి. ఈశ్వర రెడ్డికి చెందిన ఎకరా వేరుశనగ, అరటిచెట్లు, మామిడిచెట్లు, బొప్పాయి, పనసచెట్లు, డ్రిప్ పైపులను ధ్వంసం చేశాయి. 25 ఏళ్ల కొబ్బరిచెట్టును నేలమట్టం చేసిన ఏనుగులు వ్యవసాయ మోటర్‌ను కదిలించాయి.శంకర్‌కు చెందిన అర్ధ ఎకరా అలసంద పంటను ధ్వంసం చేసి మామిడిచెట్ల కొమ్మలను విరిచేశాయి.సురేష్, నందగోపాల్, వెంకట్రమణ, శ్రీనివాసులు, సోమశేఖర్, నటరాజ, మునిరాజకు చెందిన కొబ్బరిచెట్లను కూకటివేళ్లతో పెకలించాయి.మామిడిచెట్లలో కొమ్మలను విరిచేశాయి.రంగన్న, దొరస్వామి, శ్రీనివాసులుకు చెందిన మామిడిచెట్లను ధ్వంసం చేసిన ఏనుగులు డ్రిప్ పైపులను ఇష్టారాజ్యంగా తొక్కేశాయి. అనంతరం వచ్చిన మార్గంలోనే ఏనుగుల గుంపు అడవిలోకి చేరుకుంది. శుక్రవారం పగలంతా తూర్పు పెద్దవంక వద్ద ఏనుగుల గుంపు తిష్ట వేసినట్లు అటవీశాఖ సిబ్బంది తెలిపారు.


ఏనుగుల దాడిలో నేలకూలిన కొబ్బరిచెట్టు

● ధ్వంసమైన పంటలను పరిశీలించిన రేంజర్

పులిచెర్ల మండలం పాతపేట వద్ద ఏనుగుల గుంపు ధ్వంసం చేసిన పంటలను శుక్రవారం మధ్యాహ్నం రేంజర్ పట్టాభి, డీఆర్వో రాకేష్‌కుమార్ పరిశీలించి బాధిత రైతులతో మాట్లాడారు.పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లిస్తామన్నారు. ఏనుగుల దాడిలో ధ్వంసమైన పంటల వివరాలను ఎప్పటికప్పుడు సిబ్బంది పరిశీలించి నివేదికలు ఇవ్వాలన్నారు.

డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల రీవెరిఫికేషన్

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మెగా డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాల రీ వెరిఫికేషన్ ప్రక్రియ డీఈవో వరలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం స్థానిక అపోలో యూనివర్శిటీలో కొనసాగింది. ఇప్పటికే మూడు విడతలుగా అభ్యర్థులు నేరుగా ధ్రువీకరణ పత్రాలు సమర్పించి, వెరిఫికేషన్ చేయించుకున్న విషయం తెలిసిందే. కాగా రాష్ట్ర విద్యాశాఖ అధికారుల సూచనల మేరకు విద్యార్థులు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలు, ఫిజికల్ వెరిఫికేషన్ చేసిన సమయంలో అభ్యర్థులు సమర్పించిన ధ్రువపత్రాలు సరిపోల్చే ప్రక్రియ సాగింది. ఇటీవల లాగే 30 టీఎంలు వారికి కేటాయించిన డీఎస్సీ అభ్యర్థుల ధ్రువీకరణ పత్రాలను రీవెరిఫికేషన్ చేస్తున్నారు.

ప్రమోదంలో ప్రమాదం

పరమసముద్రం చెరువులో బాలుడి గల్లంతు


విలపిస్తున్న యువన్ శంకర్ తండ్రి వెంకటేశ్‌ను ఓదారుస్తున్న ఎమ్మెల్సీ కంచర్ల


గల్లంతైన యువకుడు యువన్ శేఖర్

కుప్పం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువలో తరలివస్తున్న కృష్ణా జలాలతో నిండుకుండలా తొణికిసలాడుతున్న పరమసముద్రం చెరువులో యువన్ శేఖర్ (17) అనే యువకుడు శుక్రవారం గల్లంతయ్యాడు. కుప్పం అర్బన్ సీఐ శంకరయ్య కథనం మేరకు....కుప్పం పురపాలక సంఘం పరిధిలోని పరమసముద్రం గ్రామానికి చెందిన వెంకటేశ్ కుమారుడు యువన్ శేఖర్ శాంతిపురంలో ఐటీఐ చదువుతున్నాడు. మిలాడి ఉన్ నబీ సందర్భంగా కళాశాలకు సెలవు కావడంతో శుక్రవారం ఉదయం ఈత కొట్టేందుకు పరమసముద్రం చెరువుకు వచ్చాడు. ముగ్గురు స్నేహితులు కలిసి నిండిన చెరువులో సరదాగా ఈత కొడుతూ పోటీలు పడి లోపలివైపు వెళ్లారు.కొంతసేపటికి తిరిగి ఒడ్డుకు చేరుకున్న ఇద్దరు స్నేహితులు యువన్ శేఖర్ బయటకు రాకపోవడంతో అతని తండ్రికి సమాచారం ఇచ్చారు. మరోవైపు సమాచారం అందుకున్న కుప్పం అర్బన్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలు చేపట్టారు. శుక్రవారం సాయంత్రానికి కూడా యువన్ శేఖర్ ఆచూకీ కనిపెట్టలేకపోయారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, రెస్కో ఛైర్మన్ వీజీ.ప్రతాప్, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్ తదితరులు చెరువు వద్దకు చేరుకుని గాలింపు చర్యలను పర్యవేక్షించారు.యువన్ శేఖర్ తల్లిదండ్రులను ఓదార్చారు.

చెరువులో పడి విద్యార్థి మృతి


యువరాజ్ మృతదేహం

నింద్ర, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నగరి పట్టణం కేవీపీఆర్ పేటకు చెందిన నేత కార్మికుడు ఆర్ముగం కుమారుడు యువరాజ్(14) చెరువులో పడి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు...9వ తరగతి చదువుతున్న యువరాజ్ శుక్రవారం సెలవు కావడంతో స్నేహితులతో కలసి గుండ్రాజుకుప్పం దళితవాడ సమీపంలో క్రికెట్ ఆడడానికి వెళ్లాడు. ఆట ముగిశాక మైదానానికి పక్కనే ఉన్న చెరువులో ఈతకు దిగాడు. లోతు ఎక్కువై నీట మునిగిపోవడంతో మృతి చెందాడు.యువరాజ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పోలీసులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఎరువుల పంపిణీలో తేడాలొస్తే కఠిన చర్యలు
7లో

శాస్త్రోక్తంగా ధ్వజావరోహణం

కాణిపాకంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు


పుష్కరిణిలో త్రిశూలానికి క్షీరాభిషేకం

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుని ఆలయంలో శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ధ్వజావరోహణ కార్యక్రమంతో బ్రహ్మోత్సవాలు ముగిశాయి.ఆలయంలోని ధ్వజస్తంభంపై వున్న మూషిక ధ్వజ పటాన్ని అర్చకులు, వేదపండితులు మేళ,తాళాలు,వేద మంత్రోచ్ఛారణ నడుమ కిందకు దించడంతో ధ్వజావరోహణం పూర్తయింది.అంతకుముందు పుష్కరిణి వద్ద త్రిశూల స్నానాన్ని నిర్వహించారు. బ్రహ్మోత్సవ సమయంలో స్వామివారికి రక్షగా యాగశాలలో త్రిశూలాన్ని ఉంచుతారు.రోజూ ఉదయం పుర వీధులలో టింగ్‌టింగ్ పిళ్లారప్పగా(సప్పరం) త్రిశూలాన్ని ఊరేగిస్తారు.త్రిశూలస్నానం తరువాత యాగశాలలో మంత్రబద్ధంగా 108 మట్టికుండల్లో ఉంచిన నవ ధాన్యాలను తీసుకొచ్చి పూజలు నిర్వహించారు. అనంతరం త్రిశూలాన్ని, మొలకెత్తిన నవధాన్యాలను పుష్కరిణిలో నిమజ్జనం చేశారు.కాగా బ్రహ్మోత్సవాల విధుల్లో అలసిసొలసిన ఆలయ అధికారులు, సిబ్బందికి ఆట విడుపుగా వసంతోత్సవాన్ని నిర్వహించారు.ఈవో కిషోర్ సహా అధికారులు, సిబ్బంది రంగులు చల్లుకుని సంతోషాన్ని ప్రకటించారు.బ్రహ్మోత్సవాల ప్రారంభ సందర్భంగా ఈవో కిషోర్‌కు, ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్‌కు కట్టిన కంకణాలను శుక్రవారం అర్చకులు తొలగించారు.అనంతరం ఈవోను ఆలయ మర్యాదలతో కార్యాలయం వద్ద దిగబెట్టారు. ఈ కార్యక్రమాన్ని ఆచార్యోత్సవం అంటారు.అలాగే వరసిద్ధి వినాయకస్వామికి వడాయత్తు ఉత్సవాన్ని నిర్వహించారు. ఉభయదారుగా కాకర్లవారిపల్లెకు చెందిన కీర్తిశేషులు గాలిఉమాపతినాయుడు జ్ఞాపకార్థం ఆయన కుమార్తె సుజాత వ్యవహరించారు. ఈ సందర్భంగా స్వామి వారికి అభిషేకం నిర్వహించాక మూలవిరాట్‌కు వడ మాలను(వడలతో తయారు చేసిన మాల) ధరింపజేశారు. అలాగే స్వామికి పెసరపప్పు పాయసాన్ని నైవేద్యంగా సమర్పించారు.అనంతరం స్వామికి ఏకాంత సేవను నిర్వహించారు.కీర్తిశేషులు కె.సోమశేఖర్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారులు ఉభయదారులుగా వ్యవహరించారు.ఈ సందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయకస్వామి ఉత్సవ విగ్రహాలకు ధూప, దీప నైవేద్యాలు సమర్పించి హారతులిచ్చారు. అనంతరం తీసుకెళ్లి అలంకార మండపంలో ఉంచి అధికారులు, అర్చకులు, సిబ్బంది వెనుదిరిగారు.ఈ కార్యక్రమాల్లో ఏఈవోలు రవీంద్రబాబు, ఎస్వీ కృష్ణారెడ్డి, ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్‌బాబు, ఆలయ ఇన్‌స్పెక్టర్లు బాలాజీనాయుడు, చిట్టిబాబు పాల్గొన్నారు.


మూషిక ధ్వజపటాన్ని దించుతున్న అర్చకుడు ధర్మేశ్వర్‌గురుకుల్


ఏకాంత సేవలో సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధుడు

నేటినుంచి ప్రత్యేక ఉత్సవాలు

కాణిపాకంలో శనివారం నుంచి ప్రత్యేక ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 6వ తేదీన అధికారనంది వాహనం, 7న రావణ బ్రహ్మ వాహనం(చంద్ర గ్రహణం కారణంగా ఉత్సవాలను ఉదయం నిర్వహిస్తారు.), 8న యాళి వాహనం, 9న సూర్యప్రభ,10న చంద్రప్రభ వాహన సేవలు, 11న కల్పవృక్ష వాహనసేవ, 12న విమానోత్సవం, 13న పుష్పపల్లకి సేవ, 14న కామధేను వాహనం,15న పూలంగి సేవ, 16న తెప్పోత్సవం నిర్వహించనున్నారు.

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు. ఈ యోగా కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప కేంద్రాలలో తెలుగులో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహాముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందారు. దీనికి సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 04041896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

శ్రీవారి సేవలో మరింత నాణ్యత: టీటీడీ ఈవో



తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): ఇటీవల చేపట్టిన సంస్కరణల వల్ల శ్రీవారిసేవలో నాణ్యత పెరుగుతుందని టీటీడీ ఈవో శ్యామలరావు అన్నారు. శ్రీవారిసేవకులకు గ్రూప్ సూపర్‌వైజర్లు, ట్రైనర్లకు శిక్షణ మాడ్యూల్‌పై శుక్రవారం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఈవో సమీక్ష నిర్వహించారు. శిక్షణ మొదటి విడత కార్యక్రమం ఈనెల 24 నుంచి ప్రారంభమై మూడురోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఏపీ ప్లానింగ్ విభాగం ఈడీ వెంకటేశ్వరావు, టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, వర్చువల్‌గా ఐఐఎం అహ్మదాబాద్‌కు చెందిన ప్రొఫెసర్లు విశ్వనాథ్, రామమోహన్, అదనపుఈవో వెంకయ్య చౌదరి ఈసమీక్షలో పాల్గొన్నారు.

తిరుమలలో నేడు అనంతపద్మనాభ వ్రతం

తిరుమల, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం అనంతపద్మనాభ వ్రతం జరుగనుంది. ఉదయం 6 గంటలకు శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వారును ఆలయం నుంచి ఊరేగింపుగా వరాహస్వామి ఆలయ ప్రాంగణంలోని పుష్కరిణి వద్దకు తీసుకువచ్చి పూజలు నిర్వహిస్తారు. అనంతరం శ్రీవారి సుదర్శన చక్రత్తాళ్వార్లకు స్వామి పుష్కరిణీలో చక్రస్నానం నిర్వహించి తిరిగి ఆలయానికి తీసుకువస్తారు. శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో చివరిరోజున, వైకుంఠ ద్వాదశి, రథసప్తమి రోజుల్లో కూడా చక్రస్నానం నిర్వహిస్తారు.

సర్వదర్శనానికి 14 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శుక్రవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరి 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

బుధవారం హుండీ ఆదాయం: రూ.3.49 కోట్లు

గురువారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 59,834

తలనీలాలు సమర్పించినవారు: 24,628



సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందుకుంటున్న ప్రొఫెసర్లు ఎం.అరుణ (హోంసైన్స్) | పెంచలనేని జ్యోత్స్న (బయో టెక్నాలజీ) | వెంకటకృష్ణ (కంప్యూటర్‌సైన్స్) | వైఎస్ శారద (ఇంగ్లీషు) | డి.సుబ్బారావు (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్) | అక్కల స్వతంత్ర (మెకానికల్ ఇంజనీరింగ్) | టి.రమాశ్రీ (ఈసీఈ) | ఎం.బాలాజీ (బయోకెమిస్ట్రీ) | టి.విజయ (బోటనీ)



టి.చంద్రశేఖరయ్య (పాపులేషన్ స్టడీస్) | రమ్యాకుబేర్ (ఫార్మసీ) | సి. భువనేశ్వరిదేవి (పద్మావతి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్) | ఈశ్వరరావు (లైవ్‌స్టాక్ ప్రొడక్ట్స్ టెక్నాలజీ) | లెక్చరర్లు పి.కుమారి నీరజ (శ్రీకాళహస్తి మహిళా డిగ్రీ కళాశాల) | గంగారామ్ (శ్రీకాళహస్తి ప్రభుత్వ బాలుర డిగ్రీ కళాశాల) | చీర్ల వెంకటరమణ (చంద్రగిరి ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల) | టీచర్లు సుబ్రహ్మణ్యశర్మ (శ్రీకాళహస్తి మండలం ముచ్చివోలు) | కె.బాలసుబ్రహ్మణ్యం (తొట్టంబేడు మండలం సాంబయ్యపాలెం) | శెట్టి రామకృష్ణ (శ్రీకాళహస్తి మండలం ఎగువవీధి పాఠశాల పీడీ) | ఎస్వీ కుమార్ (పుత్తూరు మండలం పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్)



అమ్మవారికి హారతులు ఇస్తున్న అర్చకులు

శాస్త్రోక్తంగా పవిత్ర ప్రతిష్ఠ

తిరుచానూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో శుక్రవారం పవిత్రోత్సవాలు పవిత్ర ప్రతిష్ఠతో ప్రారంభమయ్యాయి. మొదటి రోజు శ్రీపద్మావతి అమ్మవారికి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవలో అమ్మవారిని మేల్కొపి అర్చకులు నిత్య కైంకర్యాలు నిర్వహించారు ఉదయం ఉత్సవర్లను ఆలయం నుంచి యాగశాలకు వేంచేపు చేశారు. అనంతరం ద్వార తోరణ, ధ్వజ కుంభ ఆవాహనం, చక్రాధి మండల పూజ, చతుస్థానార్చన, అగ్ని ప్రతిష్ఠ, పవిత్ర ప్రతిష్ఠ నిర్వహించారు. మధ్యాహ్నం శ్రీకృష్ణస్వామి మండపంలో అమ్మవారికి స్నపన తిరుమంజనం నిర్వహించి, విశేషంగా అలంకరించారు. పవిత్రోత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో పలు ఆర్జిత సేవలను టీటీడీ రద్దు చేసింది. ఈ కార్యక్రమంలో టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, సూపరింటెండెంట్ రమేష్, అర్చకులు శ్రీనివాసాచార్యులు, మణికంఠ స్వామి, బాబుస్వామి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు. పవిత్రోత్సవాల్లో రెండో రోజైన శనివారం శనివారం పవిత్ర సమర్పణ ఉంటుంది.



యాగశాలలో ప్రత్యేక పూజలు

అక్టోబరు 7న భవ్య గుజరాత్ యాత్ర

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) : రేణిగుంట రైల్వే స్టేషన్ నుంచి అక్టోబరు 7వ తేదీన భవ్య గుజరాత్ యాత్రకు ప్రత్యేక రైలు బయలుదేరుతుందని ఏరియా మేనేజర్ కె.వేణుగోపాల్ తెలిపారు. తిరుపతి రైల్వే స్టేషన్‌లోని ఐఆర్సీటీసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఈ యాత్రకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ యాత్రలో ద్వారక, నాగేశ్వర్ ఆలయం, సోమనాథ్ ఆలయం, అహ్మదాబాద్, మోథేరా, సూర్యదేవాలయం, సబర్మతి ఆశ్రమం, సబర్మతి నదీ తీరం, యునెస్కో వారసత్వ స్థలం రాణికి వావ్, ప్రపంచ ప్రఖ్యాత స్టాచ్యూ ఆఫ్ యూనిటీ వంటి పుణ్యక్షేత్రాలు, చారిత్రక క్షేత్రాలను దర్శించుకునే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ఈ యాత్రా రైలు రేణిగుంట నుండి ప్రారంభమై గూడూరు, నెల్లూరు, చీరాల, తెనాలి, విజయవాడ, ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్, నిజాముద్దీన్, హుజూర్ సాహెబ్, నాందేడ్, పూణే మార్గంలో ప్రయాణించి తిరిగి అదే మార్గం ద్వారా రేణిగుంటకు చేరుతుందన్నారు. ప్రయాణికులకు వసతితో పాటు ఉదయం టీ, బ్రేక్‌ఫాస్ట్, లంచ్, డిన్నర్, శాకాహార భోజనం, వాటర్ బాటిల్ వంటి సౌకర్యాలతో పాటు ప్రయాణ బీమా కూడా కల్పించినట్లు వివరించారు. టిక్కెట్టు ధరలు స్లీపర్ క్లాస్ రూ.18,400లు, త్రీటైర్ ఏసీ రూ.30,200లు, టూటైర్ ఏసీ రూ.39,900లుగా నిర్ణయించినట్లు తెలిపారు. పది రోజుల పాటు ఈ యాత్ర కొనసాగుతుందన్నారు. టిక్కెట్టు బుకింగ్ కోసం కె.పవన్‌కుమార్‌ను 9281495853, యేసయ్యను 8287932313 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భాస్కర్‌బాబు, వీరన్న, కోదండం, శంకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

50 హెక్టార్లలో ఎకో టూరిజం ఏర్పాటు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, సెప్టెంబర్ 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరులోని కుంకీ ఏనుగుల క్యాంపునకు ఎదురుగా 50 హెక్టార్లలో త్వరలో ఎకో టూరిజం ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి తెలిపారు. శుక్రవారం పలమనేరులో ఆయన గజబాధితులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఏనుగుల నుంచి పంట, ప్రాణ నష్టాల నివారణకు ప్రభుత్వ పరంగా అన్ని చర్యలు తీసుకొంటున్నామని తెలిపారు. ప్రభుత్వం ఏర్పడిన ఏడాదిలోనే ఇక్కడికి కుంకీ ఏనుగుల ప్రాజెక్టును తీసుకొచ్చామని... ఆధునిక టెక్నాలజీతోపాటు కుంకీలతో పూర్తిగా ఏనుగుల దాడులను నివారించనున్నట్లు తెలిపారు. రైతులకు పంట నష్టాలు జరగకుండా ఏనుగుల కదలికలను ముందుగానే గుర్తించేవిధంగా వాటికి చిప్‌ల ఏర్పాటుతో పాటు హ్యాంగింగ్ సోలార్ ఫెన్సింగ్, కుంకీ ఏనుగుల ద్వారా కట్టడి చేయనున్నట్లు తెలిపారు. కుంకీ ఏనుగుల ప్రాజెక్టుకు ఎదురుగా ఎకోటూరిజం 50 హెక్టార్లలో త్వరలోనే రూపుదిద్దుకోనున్నట్లు అమరనాథరెడ్డి తెలిపారు.

పాడిరైతుల్లో ఆనందం వెల్లువ

- ఎద క్రమబద్ధీకరణ పథకంతో సత్ఫలితాలు
- స్వర్ణ నారావారిపల్లెలో తొలిదశలోనే 61 శాతం విజయవంతం



ఎద క్రమబద్ధీకరణ, చూలు కట్టించేందుకు రైతులు తీసుకువచ్చిన పశువులు

చంద్రగిరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సొంత గ్రామం నారావారిపల్లె క్లస్టర్ పరిధిలో పాడిరైతుల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. ఈ క్లస్టర్ పరిధిలో ఎ.రంగంపేట, కందులవారిపల్లె, చిన్నరామాపురం పంచాయతీలున్నాయి. సీఎం సంకల్పం మేరకు స్వర్ణ నారావారిపల్లె పైలెట్ ప్రాజెక్టులో క్లస్టర్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఆదాయాభివృద్ధితో స్వావలంబన సాధించేలా పథకాలు రూపొందించారు. ఇప్పటికే నారావారిపల్లెలో అత్యధిక సౌరవిద్యుత్ కనెక్షన్లు ఏర్పాటు చేశారు. ఈక్రమంలోనే ఇటీవల జిల్లా కలెక్టర్ స్కోచ్ అవార్డు కు ఎంపికయ్యారు. అదేవిధంగా పశు సంవరక్షశాఖ ఆధ్వర్యంలోని ఎద క్రమబద్ధీకరణ పథకం క్లస్టర్ పరిధిలో పాడిరైతులకు వరంగా మారింది. గతంలో చూలు కట్టని పశువుల పోషణ రైతులకు ఆర్థిక భారమయ్యేది. పశువులను మేపడం కష్టమై ఒక్కోసారి కోతకు కూడా విక్రయించేవారు. పశువు ఏటా ఈనితేనే లాభమొస్తుంది. ఈనేపథ్యంలో ఈ ఏడాది మార్చి చివర్లో ఎద క్రమబద్ధీకరణ పథకం కింద 171 మంది రైతులకు చెందిన 218 పశువులను ఎదకు రానివిగా గుర్తించారు. 50 శాతం రాయితీతో రూ.400 కట్టించుకుని రూ.1100 విలువ గలదాణా, ఖనిజలవణ మిశ్రమం, లవణ మాత్రలు, హార్మోను ఇంజక్షన్లు తదితర మందులను రైతులకు అందించారు. ఇవి చూలు కట్టడానికి దోహదపడుతున్నాయి. నిత్యం సుమారు 25 మంది సిబ్బంది వైద్య పరీక్షలు చేస్తూ జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈనెల మొదటి వారం పరీక్షించగా 134 పశువులు ఎదకు వచ్చినట్లు గుర్తించామని పశువైద్యాధికారి తెలిపారు. మొదటి విడతలోనే 61 శాతం మేర సానుకూల ఫలితాలను రావడంతో పశువైద్య సిబ్బంది, పాడి రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాల ఉత్పత్తి పెంపు లక్ష్యం



క్లస్టర్ పరిధిలోని పశువులలో పాల ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. మొదటి విడతలోనే 61 శాతం ఫలితాలను రాబట్టాం. నాలుగు విడతల్లో వెయ్యి పశువులకు చూలు కట్టించాలనేది ఉద్దేశం. కొత్త పథకం కింద అదనంగా 4200 లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతుంది. సంవత్సరానికి రూ.73 లక్షల మేర అదనపు ఆదాయం చేకూరుతుంది.

-డాక్టర్ వంశీ, పశు వైద్యాధికారి, నారావారిపల్లె

గతంలో ఎన్నో ఇబ్బందులు



ఎద క్రమబద్ధీకరణ, చూలు కట్టించడం పాడి రైతులకు వరం. గతంలో కృత్రిమ గర్భధారణకు చాలా ఇబ్బందులు పడ్డాం. ఎదకు రాని పశువులను మేపడం కష్టంగా ఉండేది. ఆర్థికంగా దెబ్బతిని పశువులను కోతకు ఇచ్చేవాళం. సీఎం చంద్రబాబు చొరవ వల్ల కొత్త పథకంతో ఆర్థికంగా నిలబడతామని నమ్మకం కలిగింది

- చంద్రబాబునాయుడు, భీమవరం

రెండు విధాలా ఆదాయం



ఎదక్రమబద్ధీకరణ పథకం ద్వారా చూలు కట్టిన పశువును అమ్ముకోవాలన్నా రెండింతలు హెచ్చు ధర పలుకుతుంది. చూలు కట్టిన పశువు రైతు దగ్గరే ఉంటే పాల ఉత్పత్తి రెండింతలు పెరుగుతుంది. ఇలా రెండు రకాలూ ఆర్థికంగా ఆదాయం ఉంటుంది. ఈ పథకంతో పాడి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు.

- సుబ్రమణ్యంయాదవ్, ఎ.రంగంపేట

చదువు చెప్పిన చోటే వద్దంటోంది

పట్టా ఇచ్చిన సంస్థే పక్కన పెట్టేసింది ● నిబంధనలకు విరుద్ధంగా స్విమ్స్ నోటిఫికేషన్ ● మెడికల్ అభ్యర్థులకు టీటీడీ అన్యాయం

వారు అక్కడే చదువుకున్నారు. అక్కడే పట్టభద్రులయ్యారు. కొందరు అక్కడే అడహక్ కింద ఉద్యోగాలు చేస్తున్నారు. అయితే రెగ్యులర్ ఉద్యోగుల నోటిఫికేషన్‌కు మాత్రం వారు అర్హులు కాదని పక్కన పెట్టేశారు. వారు అర్హులేనని చట్టం చెబుతున్నా అవేమీపట్టకుండా మొండిగా ముందుకెళ్తున్న శ్రీవెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) యాజమాన్యంపై పలువురు వైద్య అభ్యర్థులు మండిపడుతున్నారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి

మెడికల్ కాలేజీల్లో ఫ్యాకల్టీ కొరతను దృష్టిలోపెట్టుకుని స్విమ్స్ వర్సిటీలో 2003 నుంచి మెడికల్ ఎమ్మెస్సీ కోర్సులను అందుబాటులోకి తీసుకొచ్చింది. బీఎస్సీ (లైఫ్‌సైన్సెస్) చదివిన విద్యార్థులకు స్విమ్స్ ఎంట్రన్స్ ఎగ్జామ్ నిర్వహించి, అందులో వచ్చిన ర్యాంకుల ఆధారంగా అనాటమీ, ఫిజియాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ కోర్సులలో సీట్లు కేటాయించింది. ఈ పీజీ కోర్సులకు మూడేళ్ల కాలవ్యవధిని నిర్ణయించింది. 2003లో తొలిబ్యాచ్ మొదలవ్వగా 2019 ఎంఎస్సీ మెడికల్ పీజీ కోర్సులను నిలిపివేసింది. ఈక్రమంలో 150 మంది ఎమ్మెస్సీ మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్లు ఉత్తీర్ణులై స్విమ్స్‌తో పాటు వివిధ మెడికల్ కాలేజీల్లో ఉద్యోగాలు చేస్తున్నారు. ఆయా విభాగాల్లోని పలువురు స్విమ్స్‌లోనే పీహెచ్‌డీ పూర్తిచేసి డాక్టరేట్ పట్టా పొందారు. మరికొందరు పీహెచ్‌డీ చేస్తున్నారు. పీహెచ్‌డీ చేసినవారు ప్రైవేట్ మెడికల్ కాలేజీలో ప్రొఫెసర్ స్థాయిలో కూడా ప్రస్తుతం పనిచేస్తున్నారు.

ఇప్పుడెందుకు వద్దంటున్నారు

టీటీడీ నిర్వహణలోని స్విమ్స్‌లో 9 ప్రొఫెసర్లు, 20 అసోసియేట్ ప్రొఫెసర్లు, 67 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి గతనెల 14న నోటిఫికేషన్ జారీ ఆయింది. ఈ నోటిఫికేషన్‌లో బయోకెమిస్ట్రీ, ఫార్మకాలజీ, కమ్యూనిటీ మెడిసిన్‌కు ఎండీ, ఎంఎస్ లేదా డీఎస్సీ అర్హతలు కావాలని నిర్దేశించింది. దీంతో స్విమ్స్‌లోనే చదివిన ఎంఎస్సీ/పీహెచ్‌డీ అభ్యర్థుల పట్ల అన్యాయంగా వ్యవహరించింది. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టం 1956 ప్రకారం ఎమ్మెస్సీ/పీహెచ్‌డీను మెడికల్ కాలేజీల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా తీసుకోవచ్చు. అలాకాకుండా ఎండీ, ఎంఎస్/డీఎస్సీ ఉండాలని నిబంధన పెట్టడం సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది. అదేమని అడిగితే ఐఎన్ఐ (ఇనిస్టిట్యూట్ ఆఫ్ నేషనల్ ఇంపార్టెన్స్) మేరకు రిక్రూట్ చేసుకుంటామని అభ్యర్థులకు స్విమ్స్ చెబుతున్నట్టు తెలుస్తోంది. తమకు జరుగుతున్న అన్యాయంపై కోర్టును ఆశ్రయించాలనుకున్న అభ్యర్థులకు వీలులేకుండా ముందుగానే స్విమ్స్ కేవిట్ ఫైల్ చేసింది. ఐఎన్ఐ నిబంధనలు కేవలం జాతీయ వైద్యసంస్థలైన ఎయిమ్స్, జిప్‌మర్, పీజీఐఎంఆర్ సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది. స్విమ్స్ ఇప్పటికీ స్టేట్ యాక్ట్ (రాష్ట్ర చట్టం)తో నడిచే విశ్వవిద్యాలయం మాత్రమే. నాన్‌క్లినికల్ మెడికల్ కోర్సులు (ఎమ్మెస్సీ/పీహెచ్‌డీ) చేసిన అభ్యర్థులు అర్హులేనని స్టేట్ యాక్ట్‌తో నడిచే వర్సిటీ నిబంధనలు చెబుతున్నాయి. ఆ మేరకే ఎస్వీమెడికల్ కాలేజ్, శ్రీబాలాజీ మెడికల్ కాలేజ్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ నుంచి ప్రొఫెసర్లుగా పనిచేస్తున్నారు. అయితే స్విమ్స్‌లో చదివిన విద్యార్థులను మాకొద్దని పక్కన పెట్టడం ఆశ్చర్యంగా ఉంది. తల్లిలాంటి స్విమ్స్ వర్సిటీనే తమను గుర్తించకపోతే ఇతర వైద్య సంస్థలు ఏవిధంగా ఆదరిస్తాయని వైద్య అభ్యర్థులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా స్విమ్స్ యాజమాన్యం పునరాలోచించాల్సిన అవసరం ఉందని కోరుతున్నారు.



సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని మోసం

● రూ.70వేలు తీసుకున్న దళారీని అదుపులోకి తీసుకున్న పోలీసులు



కార్తీక్

తిరుమల, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి సుప్రభాత సేవ టికెట్లు ఇస్తానని నమ్మించి మోసగించిన ఓ దళారీని పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన ప్రకారం.. గుంటూరు జిల్లాలోని వెంగలాయపాలెంకు చెందిన హరి నాగసాయి కార్తీక్ కొన్నేళ్లుగా భక్తులను మోసగిస్తూ అందినవరకు దోచుకుంటున్నాడు. ఇటీవల ఫేస్‌బుక్‌లో 'శ్రీప్రభాకర చార్యులు' అనే నకిలీ ఖాతాను తెరిచాడు. తాను తిరుమలలో సహాయ అర్చకుడినని, బ్రేక్ దర్శనాలు, ఆర్జితసేవ టికెట్లు ఇప్పిస్తానని భక్తులను నమ్మించి మోసం చేయడం మొదలుపెట్టాడు. ఆదిత్య, హరికృష్ణ, నాగార్జున అనే మరో ముగ్గురి సహాయంతో బ్యాంకు ఖాతాలు కూడా తెరిచాడు. ఈ ముఠా తిరుపతికి చెందిన విజయ్ అనే భక్తుడికి నాలుగు సుప్రభాతసేవ టికెట్లు ఇప్పిస్తామని చెప్పి రూ.70,070 తీసుకున్నారు. ఆ తర్వాత ఎలాంటి స్పందన లేకపోవడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు తిరుమల వన్‌టౌన్ ఎస్ఐలు రమేష్‌బాబు, చలపతి ప్రత్యేక నిఘా పెట్టారు. ఈ క్రమంలో శుక్రవారం తిరుమలలోని కర్ణాటక సత్రాల వద్ద కార్తీక్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్దనున్న రూ.1.03 లక్షల నగదు, సెల్‌ఫోన్‌ను స్వాధీన పరుచుకున్నారు. ఇప్పటికే కార్తీక్‌పై తిరుమల వన్‌టౌన్, టూటౌన్‌లో రెండు కేసులు, తిరుపతి ఈస్ట్‌లో మరో కేసు నమోదై ఉన్నట్టు పోలీసులు తెలిపారు. అలాగే 16 మంది ఎన్ఆర్ఐ భక్తులకు అభిషేకం టికెట్లు ఇప్పిస్తానని నమ్మించి రూ.36 లక్షలు తీసుకుని మోసం చేసిన ఘటనలో జైలుకు వెళ్లి.. బెయిల్‌పై వచ్చిన కార్తీక్.. మళ్లీ భక్తులను మోసగించడం మొదలుపెట్టాడని పోలీసులు తెలిపారు.

70మంది టీచర్లకు పురస్కారాల ప్రదానం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): విద్యారంగంలో ఉపాధ్యాయులు అందించిన ఉత్తమ సేవలకు పురస్కారాలు లభించాయి. చిత్తూరులోని జడ్పీ సమావేశ మందిరంలో శుక్రవారం నిర్వహించిన ఉపాధ్యాయ దినోత్సవంలో కలెక్టర్ సుమిత్ కుమార్, చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు గురజాల జగన్మోహన్, మురళీమోహన్, మేయర్ అముద, ప్రముఖులు కలిసి ఉపాధ్యాయులకు ఉత్తమ సేవా పురస్కారాలు ప్రదానం చేశారు. 70 మందికిగాను 69 మంది ఉపాధ్యాయులు పురస్కారాలు అందుకున్నారు. కేటగిరీలవారీగా.. గ్రేడ్-2 హెచ్ఎంలలో ఆరుగురు, స్కూల్ అసిస్టెంట్లలో 20 మంది, సెకండరీ గ్రేడ్ టీచర్లలో 29 మంది, ఏపీ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో ఇద్దరు, ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్స్‌లో ఒకరు, కేజీబీవీల్లో ఒకరు, స్పాట్ మాస్టర్ కింద ఇద్దరు, స్పెషల్ జ్యూరీ అవార్డు కింద 8 మంది టీచర్లు ఉన్నారు. ఎస్జీటీ ఎ.సుభాషిణి (ఎంపీపీఎస్, ముప్పరపల్లె, తవణంపల్లె) హాజరు కాలేదు. డీఈవో వరలక్ష్మి, సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ, జడ్పీ సీఈవో రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

● గ్రేడ్-2 హెచ్ఎం కేటగిరీలో..





ఎమ్మెల్యేలు జగన్‌మోహన్, మురళీమోహన్, కలెక్టర్ సుమిత్‌కుమార్, మేయర్ అముద చేతుల మీదుగా పురస్కారాలను అందుకుంటున్న ఎస్.హసన్ బాషా, జీహెచ్ఎస్, చిత్తూరు - కె.రుద్రాణి, జడ్పీహెచ్ఎస్(జీ)పుంగనూరు - కె.గోపినాథ్‌రెడ్డి, జడ్పీహెచ్ఎస్ కాణిపాకం, ఐరాల - ఎ.మోహన్‌రెడ్డి, జడ్పీహెచ్ఎస్ (జీ)అరగొండ, తవణంపల్లి - పి.సుదర్శన్, జడ్పీహెచ్ఎస్, ఆళ్లమడుగు, వెదురుకుప్పం - ఎస్.వాసియా ఫరాత్, కేజీబీవీ, పుంగనూరు

● స్కూల్ అసిస్టెంట్ కేటగిరీలో..




ఎ.సుజాత, జడ్పీహెచ్ఎస్, ఆర్‌పేట, కుప్పం - ఎస్.రేవతి, పీఎస్‌సీ, జీహెచ్ఎస్, నగరి - కె.పాపయ్య, జీహెచ్ఎస్, చిత్తూరు - ఎం.ధనలక్ష్మి, జడ్పీహెచ్ఎస్ (జీ) అరగొండ, తవణంపల్లె - బి.మధనయ, జడ్పీహెచ్ఎస్ (జీ), అరగొండ, తవణంపల్లె - ఎన్.రాజగోపాల్, జడ్పీహెచ్ఎస్, వనమలదిన్నె, పుంగనూరు - ఎ.మీనాక్షి, జడ్పీహెచ్ఎస్, వరిగపల్లె, యాదమరి - ఎ.గోవిందరెడ్డి, జడ్పీహెచ్ఎస్, జీడీనెల్లూరు - టి.కౌసల్యా దేవి, జడ్పీహెచ్ఎస్, కడపల్లె, శాంతిపురం - డి.సుబ్రహ్మణ్యం, జడ్పీహెచ్ఎస్, ఈసీపల్లె, పూతలపట్టు



ఎ.హేమలత, డైట్, కార్వేటినగరం - ఆర్.రమ, జడ్పీహెచ్ఎస్, గంగవరం - వి.రబ్బాని, జడ్పీహెచ్ఎస్(ఉర్దూ), ఇస్లామ్‌నగర్, పుంగనూరు - కె.జ్యోతి, జడ్పీహెచ్ఎస్, పాదిరికుప్పం, కార్వేటినగరం - కార్తీక్, జీహెచ్ఎస్, చిత్తూరు - పట్టాభి ఆచారి, జడ్పీహెచ్ఎస్, తొట్టంబేడు, చిత్తూరు - ఎం.చౌదరి నాయుడు, జడ్పీహెచ్ఎస్, ముత్తిరేవుల, పూతలపట్టు - హెచ్‌వీ శేషగిరిరావు, జడ్పీహెచ్ఎస్, గుండ్లకట్టమంచి, బంగారుపాళ్యం - కె.దేవరాజ్, ఎంపీపీఎస్, చూకురుపల్లె, బంగారుపాళ్యం - ఇ.రవీంద్రనాయుడు, ఎంపీపీఎస్, డీకేపల్లె, కుప్పం

● ఏపీ రెసిడెన్షియల్ స్కూల్ కేటగిరీలో..



ధనకంఠ శాస్త్రి, పూతలపట్టు



టీఎస్.ప్రసూన, పలమనేరు

● సెకండరీ గ్రేడ్ టీచర్స్ కేటగిరీలో..



ఎన్.సురేష్‌బాబు, ఎంపీపీఎస్, ఎ.కొత్తకోట, చౌడేపల్లె - బి.సరళ, ఎంపీపీఎస్, వెందుగామపల్లె, కుప్పం - వి.రమణారెడ్డి, ఎంపీపీఎస్, కొరివిపల్లె, బంగారుపాళ్యం - ఎస్.రహానాబేగం, ఎంపీపీఎస్, యాదమరి - ఎన్‌పీ ప్రసన్నకుమారి, జడ్పీహెచ్ఎస్, గంగమ్మగుడి, ఎస్ఆర్‌పురం - ఎ.చంద్రశేఖర్, ఎంపీపీఎస్, గుంట, కార్వేటినగరం - ఎన్.శశికుమార్, ఎంపీపీఎస్, వెంగవారిపల్లె, బైరెడ్డిపల్లె - ఇ.ఇర్ఫాన్‌అలీ, ఎంపీపీఎస్ (ఉర్దూ), రొంపిచెర్ల - వి.అమృతవల్లి, ఎంపీపీఎస్, ఎల్‌పీ అగ్రహారం, చిత్తూరు



డి.రెడ్డి నరసింహులు, ఎంపీపీఎస్, చీకలచేను, సదుం - ఎస్.మధు, ఎంపీపీఎస్, కేసీపల్లె, పెనుమూరు - ఏఎన్ అమరేష్, ఎంపీపీఎస్, కోటచెంబగిరి, గుడుపల్లె - పి.విజయ, ఎంపీపీఎస్, కీలపట్ల, నగరి - పి.రాధాకుమారి, జడ్పీహెచ్ఎస్, చెర్లోపల్లె, చిత్తూరు - ఎం.లీలావతి, ఎంపీపీఎస్, పొనగుంట, ఐరాల - కె.కమలాపతి, ఎంపీపీఎస్, విింజం, జీడీనెల్లూరు - ఆర్.ఆనంద్, ఎంపీపీఎస్, జి.కొత్తూరు, వి.కోట - టి.ఆనందయ్య, బీపీఎస్, టీఆర్‌పురం, పాలసముద్రం - కె.చంద్రశేఖర్‌పిళ్లై, ఎంపీపీఎస్, పొనాటూరు, గుడిపాల

● ట్రైబల్ వెల్ఫేర్ స్కూల్ కేటగిరీలో..



ఎ.షీబా, విజలాపురం, రామకుప్పం



ఎస్.శంకర్, ఎంపీపీఎస్, రామకుప్పం - బి.కాంచన, ఎంపీపీఎస్, గొబ్బిలకొత్తూరు, పలమనేరు - ప్రియాంక, ఎంపీపీఎస్, గంద్రాజుపల్లె, గంగవరం - ఎస్.ఫైరోజ్‌బాషా, ఎంపీపీఎస్, రెడ్డిపల్లె, శాంతిపురం - జి.వెంకటయ్య, ఎంపీపీఎస్, ఎల్లంకివారిపల్లె, పులిచెర్ల - బి.బజ్జమ్మ, ఎంపీపీఎస్, సంతపల్లె, తవణంపల్లె - పి.కవిత, ఎంపీపీఎస్, 19గొల్లపల్లె, పూతలపట్టు - టి.లక్ష్మీకుమారి, ఎంపీపీఎస్, తుమ్మింద, చిత్తూరు - వాసవి, ఎంపీపీఎస్, గ్రీమ్స్‌పేట, చిత్తూరు - కె.గాయత్రి, ఎంపీపీఎస్, సంతపేట, చిత్తూరు

● కేజీబీవీ కేటగిరీలో...



నిర్మల, సీఆర్‌టీ, బైరెడ్డిపల్లె

● స్పాట్స్ కేటగిరీలో..



ఎస్.మోహన్, ఏపీ మోడల్ స్కూల్, బైరెడ్డిపల్లె - సంధ్య, కేజీబీవీ, రామకుప్పం

● స్పెషల్ జ్యూరీ అవార్డు కేటగిరీలో..



ఎన్.ఇందిర, డీవైఈవో, చిత్తూరు - ఎం.లోకేశ్వర్‌రెడ్డి, డీవైఈవో, మదనపల్లె - నాగేశ్వరరావు, ఎంఈవో-1, బంగారుపాళ్యం - ఆర్.రుషేంద్రబాబు, ఎంఈవో-1, ఐరాల - వసుమతి దేవి, ఎంఈవో-1, నింద్ర



ఆర్‌సీ తిరుమల, ఎంఈవో-2, చౌడేపల్లె - ఆర్.సుబ్బరామయ్య, గ్రేడ్-2 హెచ్ఎం, జడ్పీహెచ్ఎస్, జీడీనెల్లూరు - బాలచైతన్య, గ్రేడ్-2 హెచ్ఎం, జడ్పీహెచ్ఎస్, కలుపల్లె, గంగవరం

డిప్యూటీ ఎంపీడీవోలు, ఏవోలకు పదోన్నతి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అనేక మండలాల్లో ఎంపీడీవో పోస్టులు ఖాళీలు ఉన్నాయి. ఆ స్థానంలో ఏవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు ఇన్‌చార్జ్ ఎంపీడీవోలుగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని 22 మంది సీనియర్ డిప్యూటీ ఎంపీడీవోలు, ఏవోలకు ఎంపీడీవోలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల నుంచి ఎంపీడీవోలుగా పదోన్నతి పొందిన వారిలో.. 22 మందిని ఉమ్మడి చిత్తూరు జిల్లాకు కేటాయించారు. నెల్లూరు జిల్లా నుంచి అప్పాజి, ప్రసాద్, మనోహర్‌గౌడ్, పి.రవీంద్ర, వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లురావు, పి.శ్యామ్, వాసుదేవరావులను కేటాయించారు. కడప నుంచి చంద్రశేఖర్‌రెడ్డి, చిత్తూరు జిల్లా నుంచి చంద్రశేఖర్‌రెడ్డి, రాధారాణి, వనజ, వాణి, రవిచంద్ర, తిరుపతి జిల్లా నుంచి శ్రీదేవి, ఉమమహేశ్వరరావు, విజయమ్మ, రవీంద్ర బాబు, అన్నమయ్య జిల్లా నుంచి శ్రీధర్‌రావు, బాపూజీపట్నాయక్, సఖుర్, లతీఫ్‌ఖాన్‌లను కేటాయించారు. వీరికి జడ్పీ సీఈవో రవికుమార్ నాయుడు మండలాలు కేటాయించనున్నారు.

మహ్మద్ ప్రవక్త కేశాల ఊరేగింపు

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని ముస్లింలు మిలాద్ ఉన్ నబీని శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మహ్మద్ ప్రవక్త కేశాలను గంగసపల్లె మసీదు నుంచి మేళతాళాలతో ఊరేగించారు. దర్గా, పలమనేరు రోడ్డు, ఎమ్మెస్సార్, హైరోడ్ చర్చి వీధి, మార్కెట్ చౌక్, బజారు వీధి చిన్నమసీదుల నుంచి అసార్‌వీధి మసీదు వద్దకు కేశాలను తీసుకొచ్చి భక్తుల దర్శనార్థం ఉంచారు. మహ్మద్ ప్రవక్త కేశాలను శనివారం కూడా ప్రదర్శించనున్నట్లు ప్రభుత్వ ఖాజీ కమాలుల్లా జుహారి తెలిపారు. ఈ సందర్భంగా ఉపవాసం చేసి.. తమ పూర్వీకుల ఆత్మ శాంతికై ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఊరేగింపులో అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



దర్గా సర్కిల్‌లో ఊరేగింపుగా తీసుకొస్తున్న మహ్మద్ ప్రవక్త కేశాలు

ఎరువుల పంపిణీలో లోపాలుంటే కఠిన చర్యలు

● కలెక్టర్ హెచ్చరిక

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎరువుల పంపిణీలో లోపాలుంటే కఠిన చర్యలు ఉంటాయని కలెక్టర్ సుమిత్ కుమార్ హెచ్చరించారు. నిల్వలు తక్కువగా ఉన్న సొసైటీలకు వెంటనే యుద్ధ ప్రాతిపదికన ఎరువులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రైవేటు డీలర్ల వద్ద నిబంధనలకు మించి యూరియా నిల్వలు లేకుండా ప్రత్యేక నిఘా పెట్టాలన్నారు. మోతాదుకు మించి పంటలకు అధికంగా ఎరువులు వినియోగించకుండా రైతులకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలో అవసరమైన మేర ఎరువుల నిల్వలు ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. శుక్రవారం నాటికి ఆర్ఎస్‌కేలలో 2,200 టన్నులు, ప్రైవేటు దుకాణాల్లో 307 టన్నులు, సింగిల్ విండోల్లో 28 టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయని వివరించారు. రైతుల అవసరాల దృష్ట్యా ప్రభుత్వం యూరియా సరఫరాను నిరంతరాయంగా కొనసాగిస్తోందని తెలియజేశారు.

రేపు బోయకొండ ఆలయం మూత

చౌడేపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయం చంద్రగ్రహణం సందర్భంగా ఆదివారం మధ్యాహ్నం 3 గంటలకు ఆలయం మూత వేయనున్నట్లు ఆలయ ఈవో ఏకాంబరం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తిరిగి సోమవారం ఉదయం ఆలయ వేదపండితులచే పుణ్యాహవచనం, శుది, అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించిన అనంతరం అమ్మవారి దర్శనం కల్పించనున్నట్లు పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి దుర్మరణం

ఇద్దరు విద్యార్థులకు తీవ్రగాయాలు

పూతలపట్టు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేటు బ్యాంకు ఉద్యోగి దుర్మరణం చెందాడు. ఇద్దరు విద్యార్థులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. పాకాల మండలం గుండ్లకట్టమంచికి చెందిన ఉమాపతి కుమారుడు హరి (34) చిత్తూరులోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఉద్యోగం చేస్తున్నాడు. శుక్రవారం రాత్రి విధులు ముగించుకుని స్వగ్రామానికి ద్విచక్రవాహనంలో బయల్దేరాడు. రాత్రి 11.35 గంటలకు పూతలపట్టు మండలంలోని ముత్తిరేవుల బ్రిడ్జి వద్దకొచ్చేసరికి ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి.. ముందు వెళుతున్న ద్విచక్ర వాహనాన్ని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హరి అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు వెళుతున్న బైక్‌లోని ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. బాధితులను స్థానికులు చికిత్స నిమిత్తం చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పూతపట్టు సీఐ కృష్ణమోహన్ సంఘటన స్థలానికి చేరుకుని విచారిస్తున్నారు.

పలమనేరు ఏఎంసీ ఛైర్మన్‌గా రాజన్న



పలమనేరు, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): పలమనేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా గంగవరం మండలానికి చెందిన ఆలకుప్పం రాజన్న నియమితులయ్యారు.దాదాపు రెండేళ్లుగా ఖాళీగా వున్న ఏఎంసీ ఛైర్మన్ పదవిని పలువురు ఆశించినా ఎమ్మెల్యే అమరనాథరెడ్డి సూచించిన రాజన్నకే దక్కింది. ఈ సందర్భంగా వాల్మీకి సంఘ నాయకులతో కలసి రాజన్న శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు.

గజ బాధితులకు పరిహారం పంపిణీ



బాధితుడికి నష్టపరిహారం చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు రేంజ్ పరిధిలో ఏనుగుల దాడులతో నష్టపోయిన 80 మంది రైతులకు శుక్రవారం ఎమ్మెల్యే అమరనాథరెడ్డి నష్టపరిహారంగా రూ. 12.77 లక్షలు విలువ చేసే చెక్కులను పంపిణీ చేశారు. అందులో పంట నష్టపోయిన 78 మందికి రూ.7,02,840, పాడి ఆవును నష్టపోయిన రైతుకు రూ.75 వేలు, ప్రాణ నష్టం వాటిల్లిన బాధిత కుటుంబ సభ్యులకు రూ.5 లక్షల నష్టపరిహార చెక్కులను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలమనేరులోని కుంకీ ఏనుగుల క్యాంపునకు ఎదురుగా 50 హెక్టార్లలో త్వరలో ఎకో టూరిజం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పలమనేరు సబ్ డీఎఫ్‌వో వేణుగోపాల్, ఎఫ్ఆర్‌వో నారాయణ, అటవీ సిబ్బందితోపాటు టీడీపీ నాయకులు కిషోర్‌గౌడు, ఆనంద, సోమశేఖర్‌గౌడు, నాగరాజరెడ్డి, కుట్టి, జనసేన నాయకులు దిలీప్‌కుమార్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అమరనాథరెడ్డికి సన్మానం



అమరనాథరెడ్డిని సన్మానిస్తున్న రాజన్న, వాల్మీకి సంఘ నాయకులు

పలమనేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి) : పలమనేరు ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శుక్రవారం పలమనేరు మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఆలకుప్పం రాజన్న మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాల్మీకి సంఘ నాయకులతో కలిసి రాజన్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని శాలువతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో బైరెడ్డిపల్లి మండల టీడీపీ అధ్యక్షులు కిషోర్‌గౌడు, గంగవరం మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్‌గౌడు, ప్రధాన కార్యదర్శి ప్రతాపరెడ్డి, పలమనేరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎల్.భాస్కర్, వాల్మీకి సంఘ నాయకులు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల కరపత్రాలు విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

పలమనేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరు పాతపేటలోని కనకదుర్గ ఆలయంలో ఈనెల 22 నుంచి ప్రారంభం కానున్న దసరా ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను శుక్రవారం ఆలయం వద్ద కమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దసరా ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నామని, రోజూ భక్తులకు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కె.వి.రమణ, సీపీ ప్రకాష్, కేఎన్ రత్నమ్మ, కె.ఎస్.నేతాజీ, కె.ఎం. నాగరాజు, యువరాజు, తిరుమలయ్య, డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

బాలింతలకు బేబీ కిట్ల పంపిణీ



ఎంఈఓను సన్మానిస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

వి.కోట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వి.కోట ప్రభుత్వాస్పత్రిలో బాలింతలకు బేబీ కిట్లను లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా.తమీంఖాన్ నేతృత్వంలో అందించారు. శుక్రవారం వి.కోట లయన్స్ క్లబ్ సేవా కార్యక్రమాలో భాగంగా రోగులకు పాలు, పండ్లు, రొట్టెలు, అల్పాహారం అందించారు. అలాగే కాన్పుల వార్డులో ఉన్న సుమారు పది మంది బాలింతలకు వారి పిల్లలకు అవసరమైయ్యే బేబీ కిట్లను పంపిణీ చేశారు. అలాగే టీచర్స్ డేను సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. వారికి జ్ఞాపికలు అందించి సన్మానించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఇంద్రేష్‌యాదవ్, కోశాధికారి సయ్యద్ సాదాత్, ఆర్‌ఎంలు గోపికృష్ణా, నాగభూషణం, ఎంఈవో చంద్రశేఖర్, సభ్యులు బాలగురునాథ్, ఇలియాజ్, స్వామికణ్ణన్, సుబ్బారెడ్డి, లాబూరాం, గజారాం, హరినాథ్, రమేష్, ఉమాపతి, వేణు తదితరులు పాల్గొన్నారు.



బేబీ కిట్లు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీకొన్న బస్సు

పుంగనూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): మదనపల్లె నుంచి చిత్తూరు వెళుతున్న ఓ ఆర్టీసీ అద్దె బస్సు శుక్రవారం పుంగనూరు మండలం గూడూరుపల్లె వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొనడంతో విద్యుత్ స్తంభం ధ్వంసమై ట్రాన్స్‌ఫార్మర్ కిందపడింది. బస్సులోని ప్రయాణికుల్లో ఇద్దరికి స్వల్పగాయాలయ్యాయి. అయితే పెనుప్రమాదం తప్పింది. పుంగనూరు ఏపీఎస్పీడీసీఎల్ ఏఈ ధనంజయమూర్తి సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

సగినేకుప్పం చౌడేశ్వరమ్మ ఆలయంలో చోరీ

రామకుప్పం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం మండలం సగినేకుప్పంలోని చౌడేశ్వరమ్మ ఆలయంలో గురువారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ఆలయం లోపల ఉన్న హుండీ తాళాలు పగులగొట్టి హుండీలోని సుమారు రూ.10 వేలు ఎత్తికెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు. పోలీసులు ఆలయాన్ని సందర్శించి వివరాలు సేకరించారు.

మునస్వామికి సన్మానం

రామకుప్పం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టరుగా నియమితులైన రామకుప్పం మాజీ జడ్పీటీసీ మునస్వామిని శుక్రవారం స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి రాఘవేంద్ర, మండలాధ్యక్షుడు విజయ్‌కుమార్, నేతలు వెంకటేష్, గోవిందప్ప, జయప్ప, పళని తదితరులు పాల్గొన్నారు.

బోయకొండ గంగమ్మకు
శాస్త్రోక్తంగా రాహుకాలాభిషేకాలు

చౌడేపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన బోయకొండ గంగమ్మ ఆలయంలో శుక్రవారం శాస్త్రోక్తంగా రాహుకాలాభిషేకాలు నిర్వహించారు. అమ్మవారికి ప్రీతి కరమైన రాహుకాలంలో పసుపు, కుంకుమ, గంధం, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకుని, రాహుకాల పూజలో పాల్గొని తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆలయ ఈవో ఏకాంబరం భక్తుల అన్నదానం ఏర్పాట్లు పర్యవేక్షించారు.

వైష్ణవిదేవికి ప్రత్యేక పూజలు

చౌడేపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పుదిపట్లలో వెలసిన వైష్ణవిదేవికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించి భక్తులకు దర్శనం కల్పించారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు వినోద్‌కుమార్‌రెడ్డి, శ్రావణిలు తీర్థప్రసాదాలు అందజేశారు.

అలంకరణలో విరూపాక్షి మారెమ్మ

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ నడిబొడ్డున వెలసిన విరూపాక్షి మారెమ్మ శుక్రవారం భక్తులకు కళింగకాయ అలంకరణలో దర్శనమిచ్చారు. మహిళలు మొక్కులు తీర్చుకుని తీర్థప్రసాదాలు అందుకున్నారు.

7న ఉచిత నేత్ర వైద్యశిబిరం

పలమనేరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పలమనేరు రిక్రియేషన్ క్లబ్ ఆవరణలో ఈనెల 7న ఆదివారం ఉచిత నేత్ర చికిత్సా శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చెన్నై శంకర నేత్రాలయ వైద్యులు మురళీ నేత్ర పరీక్షలు నిర్వహిస్తారని, ఆపరేషన్లు అవసరమున్న వారికి ఉచితంగా ఆపరేషన్లు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గట్టువారిపల్లెలో
అక్కదేవతల పచ్చ ఉత్సవాలు ప్రారంభం



సోమల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సోమల మండలం గట్టువారిపల్లెలో కొలువుదీరిన అక్కదేవతల ఆలయంలో శుక్రవారం పచ్చదేవర్ల ఉత్సవాలు ఘనం ప్రారంభమైయ్యాయి. ఈసందర్భంగా ఆలయం వద్ద పచ్చనితోరణాలు, విద్యుత్ అలంకరణలు చురుగ్గా చేపట్టారు. ఐదు సంవత్సరాలకు ఒక పర్యాయం ఆనవాయితీగా ఉత్సవాలు జరుపుకోవడం జరుగుతుంది. ఈక్రమంలోనే ఆలయం వద్ద గణపతి హోమం, కలశ ప్రతిష్ఠాపన తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపారు. అనంతరం స్థానిక ప్రజలు ఉపవాసదీక్షలతో 5కిలోమీటర్లు నంజంపేటకు పాదయాత్ర చేస్తూ మంగళవాయిద్యాల నడుమ అక్కదేవతల పూజా సామగ్రిని కొనుగోలు చేసి ఆలయం వద్దకు కోలాహలంగా చేరుకున్నారు. ఆలయం వద్ద నిర్వాహకులు భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

పేదలకు అందుబాటులో ట్రస్టు సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న మధుబాల

పుంగనూరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పేదలకు సేవ చేయడమే పద్మసుగుణ చారిటబుల్ ట్రస్టు లక్ష్యమని చైర్మన్ మధుబాల పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఓ ప్రైవేటు మండపంలో ట్రస్టును ప్రారంభించారు. ఈ సందర్భంగా నిరుపేదలకు ఆర్థిక సహాయం చేయడానికి తాను ముందుకు వచ్చినట్లు తెలిపారు. అలాగే ప్రతినెలా పేదల అభివృద్ధి కోసం సేవాకార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ అయూబ్‌ఖాన్, సభ్యులు నరసింహులు, కృపాకర్, చర్చి పాస్టర్ రాకేశ్ నిమోద్, విశ్రాంత డీఎస్పీ సుకుమార్‌బాబు, రవికుమార్, భరత్‌భూషణ్, ఉదయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగల చోరీపై ఫిర్యాదు

కల్లూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పులిచెర్ల మండలం పాళ్యం పంచాయతీ కోటపల్లి సమీపంలో నలుగురు రైతుల వ్యవసాయ బోర్ల వద్ద గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు విద్యుత్ వైర్లు చోరీ చేయడంతో శుక్రవారం బాధిత రైతులు కల్లూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పుంగనూరు అభివృద్ధికి కృషి చేయాలి



చంద్రబాబుతో మాట్లాడుతున్న చల్లా రామచంద్రారెడ్డి

రొంపిచెర్ల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పుంగనూరు నియోజకవర్గ ప్రజల సంక్షేమం- అభివృద్ధి లక్ష్యంగా కృషి చేయాలని పుంగనూరు నియోజక వర్గం టీడీపీ ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. గురువారం రాత్రి వరకు సచివాలయంలో సీఎంతో చల్లాబాబు కొంత సమయం సంప్రదించి పనులు, రాజకీయ సమస్యలు తెలియజేశారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు పెట్టిన కేసులు, కార్యకర్తలు, నాయకులు ఎదుర్కొన్న సమస్యలు చెప్పారు. నియోజక వర్గంలో ప్రభుత్వ కార్యక్రమానికి విచ్చేయాలని సీఎం ను కోరారు.

భక్తిశ్రద్ధలతో మిలాద్-ఉన్-నబీ

సదుం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇస్లాం మత ప్రబోధకుడు అయిన మహమ్మద్ ప్రవక్త జన్మదిన సూచికగా జరుపుకునే మిలాద్-ఉన్-నబీ వేడుకలను శుక్రవారం సదుంలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. శుక్రవారం సామూహిక నమాజులో మహమ్మద్ ప్రవక్త జీవిత విశేషాలను తెలియజేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ● **పుంగనూరు:** మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం పుంగనూరులో ఈద్ మిలాద్ ఉన్ నబీ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. స్థానిక కుమ్మరవీధి మకాన్ నుంచి ముస్లింలు ఇందిరాసర్కిల్, ప్రైవేటు బస్టాండ్, ఎన్టీఆర్ సర్కిల్ వరకు పచ్చ, తెలుపు, నల్ల జెండాలతో రెండు గుర్రాలు, పాటలతో ర్యాలీ నిర్వహించారు.

●**వి.కోట:** వి.కోట పట్టణంలోని మసీదు వీధిలో మహమ్మద్ ప్రవక్త జయంతిని పురస్కరించుకుని ముస్లిం సోదరులు ఘనంగా మిలాదున్ నబి వేడుకలు నిర్వహించారు.

గురువులే భవిష్యత్తు మార్గ నిర్దేశకులు



పలమనేరు : ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాళ్లను సన్మానిస్తున్న అధ్యాపకులు



కుప్పంలో సన్మాన ఉపాధ్యాయులతో ఎమ్మెల్సీ కంచర్ల తదితరులు

కుప్పం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గురువులే భవిష్యత్తును నిర్దేశించే మార్గదర్శకులని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, కడా పీడీ వికాస్ మర్మత్ అన్నారు. కుప్పంలోని పీఈఎస్ ఆడిటోరియంలో శుక్రవారం కడా ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎమ్మెల్సీ, పీడీలు మాట్లాడుతూ సమాజం ఉన్నత స్థితిని పొందాలంటే యువ శక్తి చాలా ముఖ్యమన్నారు. అలాంటి యువకులను విద్యార్థి దశలో తీర్చిదిద్దే అద్భుత అవకాశం ఉపాధ్యాయులకే ఉందన్నారు. దేశ భవిష్యత్తు పరోక్షంగా వారి చేతుల్లోనే ఉందని.. అటువంటి గురువులు మొత్తం సమాజానికి పూజ్యనీయులని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో రెస్కో చైర్మన్ ప్రతాప్, కడా రాజకీయ సలహా మండలి సభ్యుడు, టీడీపీ మున్సిపల్ అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఇతర సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

● **పలమనేరు:** డాక్టర్ వైద్యం సరిగ్గా అందించకపోతే రోగి చనిపోతాడని, ఇంజినీరు సరిగ్గాలేకపోతే భవనం కూలిపోతుందని అయితే గురువు సరిగ్గాలేకపోతే సమాజమే కూలిపోతుందని పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేశులు పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో ఉపాధ్యాయదినోత్సవం ఘనంగా జరుపుకొన్నారు. ఈసందర్భంగా జరిగిన సమావేశంలో ప్రిన్సిపాల్ పాల్గొని ప్రసంగించారు. ఈ సమావేశంలో వైస్ ప్రిన్సిపాల్ షన్ముగం మాట్లాడుతూ చరిత్రలో గొప్ప స్థాయికి ఎదిగిన వారిజీవితాలను విద్యార్థులు ఆదర్శంగా తీసుకొని వారి జీవిత చరిత్రలు చదవాలన్నారు. అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ నందీశ్వరయ్య మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాక్రిష్ణన్ జయంతిని పురస్కరించుకొని ప్రతిఏటా సెప్టెంబరు 5న ఉపాధ్యాయదినోత్సవం జరుపు కొంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, వైస్ ప్రిన్సిపాల్ లను శాలువకప్పి అధ్యాపకులు ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో ఐక్యూ ఎస్‌సి కోఆర్డినేటర్ డాక్టర్ బెనజీర్, విద్యార్థులు పాల్గొన్నారు.

● **సదుం:** ఉత్తమ సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులని ఎంఈవోలు నటరాజన్, దామోదర్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయ పూజోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ వృత్తికి, విద్యార్థి లోకానికి ఆదర్శప్రాయులైన దివంగత సర్వేపల్లె రాధాకృష్ణన్ సేవలను కొనియాడుతూ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఎస్టీయూ నాయకులు మోహన్ కుమార్ రెడ్డి, పాఠశాల హెచ్ఎం శ్రీరాములు నాయక్, విశ్రాంత ఎంఈవో శ్రీరాములు, ఎస్టీయూ మండల నాయకులు కిశోర్, వినోద్, నరేశ్, విశ్రాంత ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

● **పుంగనూరు రూరల్ :** సమాజాన్ని నిర్దేశించే శక్తి సామర్థ్యాలు ఉపాధ్యాయులకు ఉన్నాయని పుంగనూరు ఎంఈవోలు నటరాజారెడ్డి, రెడ్డెన్నశెట్టి పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కొత్తయిండ్లు మున్సిపల్ పాఠశాల ఆవరణలో గురుపూజోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని విశ్రాంత ఉపాధ్యాయులు రమేశ్, మణి, గుర్రప్ప, ప్రభాకర్, వెంకటరమణలను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘనాయకులు మోహన్‌యాదవ్, హరి, కిషోర్‌రెడ్డి, శ్రీధర్, మంజునాథ్, సుధాకర్, దీపారాణి, షాహీనా, రాధామణి పాల్గొన్నారు.

● **కల్లూరు :** గురువులు సమాజ నిర్దేశకులని ఎంఈవోలు శిద్దరామయ్య, పోకల తాతయ్య, జిల్లా లయన్స్‌క్లబ్ క్రీడావిభాగం అధ్యక్షులు మహమ్మదలి తెలిపారు. పులిచెర్ల ఎంపీడీవో కార్యాలయం, కల్లూరు లయన్స్‌క్లబ్ కార్యాలయంలో శుక్రవారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కల్లూరు లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు దిల్‌షాద్‌బేగంను సన్మానించి రూ.30 వేలు విలువైన ల్యాప్‌టాప్‌ను బహూకరించారు. ఎంపీడీవో కార్యాలయంలో విశ్రాంత ఉపాధ్యాయులు జయకుమార్‌రెడ్డిలను ఘనంగా సన్మానించారు. లయన్స్‌క్లబ్ సభ్యులు ఆర్ఎస్ రాజన్, ప్రకాష్, సుధాకర్‌నాయుడు, రాజారెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

●**చౌడేపల్లె:** ఉపాధ్యాయ దినోత్సవాన్ని మేకలచిన్నేపల్లె హైస్కూల్‌లో ఘనంగా నిర్వహించారు. శుక్రవారం హైస్కూల్‌లో సర్వేపల్లె రాధాకృష్ణ చిత్రపటానికి హెచ్ఎం చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు లింగమూర్తి, గోవింద్, విజయశ్రీ, మోహన్, రాధాకృష్ణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరులో విశ్రాంత ఉపాధ్యాయులకు సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



విజయవాణి సంస్థల అధినేత నాయని చంద్రశేఖర్‌ను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు



మండల ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘ నేతలు



కల్లూరు : ఉపాధ్యాయురాలు దిల్‌షాద్‌బేగంను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ నిర్వాహకులు

కృష్ణాజలాలు రావడంలో
ఆలస్యానికి ఆ తండ్రీ కొడుకులే కారణం

- గౌనివారి శ్రీనివాసులు



సమావేశంలో మాట్లాడుతున్న గౌనివారి శ్రీనివాసులు

రామకుప్పం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కుప్పానికి కృష్ణాజలాలు రావడంలో ఆలస్యానికి రాష్ట్ర స్థాయిలో తండ్రీ కొడుకులు దివంగత సీఎం రాజశేఖర్‌రెడ్డి, మాజీ సీఎం జగన్ కాగా... నియోజవర్గ స్థాయిలో ఎమ్మెల్సీ భరత్, అతని తండ్రి దివంగత చంద్రమౌళిలే కారణమని టీడీపీ రాష్ట్ర అధికారప్రతినిధి, మాజీ ఎమ్మెల్సీ గౌనివారి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం ఆయన రామకుప్పం టీడీపీ కార్యాలయంలో స్థానిక నేతలతో కలిసి ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ కుప్పానికి కృష్ణాజలాలు తీసుకొచ్చేందుకు రాజశేఖర్‌రెడ్డి, జగన్‌ల కృషే కారణమని వైసీపీ కుప్పం నియోజకవర్గ ఇన్‌చార్జి భరత్, ఇతర నేతలు చెప్పడం హాస్యాస్పదమన్నారు. 1989లో సీఎంగా ఉన్న ఎన్టీఆర్ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో తూర్పు మండలాలకు గాలేరు-నగరి, పశ్చిమ మండలాలకు హంద్రీ-నీవా ప్రాజెక్టులకు రూపు కల్పన చేశారన్నారు. అంతే కాకుండా కుప్పం వరకు హంద్రీ-నీవా కాలువ తవ్వే మార్గాలను తెలుపుతూ శిలాఫలకాలను ఏర్పాటు చేయించారన్నారు. ఆ తర్వాత వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వాలు హంద్రీ-నీవా ప్రాజెక్టును అటకెక్కించాయన్నారు. 2014లో టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీఎం చంద్రబాబు హంద్రీ-నీవా ప్రాజెక్టు పనులను ప్రారంభించి శరవేగంగా పనులు సాగేలా చూశారన్నారు. వైసీపీ శ్రేణులు ఫేక్ ప్రచారాలకు స్వస్తి చెప్పాలని, లేకుంటే ప్రజలే వారికి బుద్ధి చెబుతారన్నారు. సమావేశంలో రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టరు మునస్వామి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండల అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ, వైస్‌ఎంపీపీలు ఆంజనేయరెడ్డి, చిన్నకృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చెర్మన్ మహ్మద్‌రఫీ రెస్కో డైరెక్టర్లు విజయ్‌కుమార్, సతీష్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

రహదారుల విస్తరణకు సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మునస్వామి

రామకుప్పం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రామకుప్పం పట్టణ భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకుని పట్టణంలో రహదారుల విస్తరణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ డైరెక్టర్ మునస్వామి, టీడీపీ బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, టీడీపీ మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపీపీ, వైస్‌ఎంపీపీలు ఆంజనేయరెడ్డి, చిన్నకృష్ణ, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి కోరారు. శుక్రవారం రహదారుల విస్తరణలో భవనాలు, స్థలాల యజమానులతో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రామకుప్పం పట్టణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సీఎం చంద్రబాబు నిర్ణయించారన్నారు. ఇందులో భాగంగానే పట్టణ శివార్లలోని మిట్టపల్లె నుంచి వళ్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి ఆలయం వరకు, వైఎస్సార్ సర్కిల్ నుంచి కెంపసముద్రం, బందార్లపల్లెల వరకు 50 అడుగుల మేర రహదారులను తీర్చిదిద్దాలని ఆదేశించారని తెలిపారు. రహదారుల విస్తరణ విషయంలో అందరి అభిప్రాయాలు తీసుకోవాలని సీఎం ఆదేశించారన్నారు. అలాగే మెరుగైన నష్ట పరిహారం అందిస్తామని చెప్పారన్నారు. పట్టణానికి నాలుగైదు కిలోమీటర్లలోనే విమానాశ్రయం, పలు పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయని తెలిపారు. సమావేశంలో పలువరు భవన, స్థలాల యజమానులు మాట్లాడుతూ రహదారుల విస్తరణ విషయంలో తమకు ఎటువంటి అభ్యంతరాలు లేవని, విస్తరణ వెడల్పు 35 అడుగులకు పరిమితం చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఐ వెంకటమోహన్, రెస్కో వైస్‌చైర్మన్ విశ్వనాథ్, సింగిల్‌విండో చెర్మన్ మహ్మద్‌రఫీ, ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ సీతాపతి, రెస్కో డైరెక్టరు విజయ్‌కమార్, టీడీపీ నేతలు రామ్మూర్తి, గుర్రప్ప, జయశంకర్, సత్తి, వెంకటాచలం, రామకృష్ణప్ప, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో విద్యార్థి పాత్ర కీలకం

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో విద్యార్థి పాత్ర కీలకమైందని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. రుక్మిణీ క్రిష్ణస్వామి డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ డీకే బద్రినారాయణ, ప్రిన్సిపాల్ రమేష్ బాబు అధ్యక్షతన ఫ్రెషర్స్‌డేని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. గురువులను గౌరవించే, తల్లిదండ్రులను ప్రేమించే, దేశంపై భక్తి చూపే విద్యార్థి జీవితంలో అత్యున్నత శిఖరాలు చేరుకుంటాడన్నారు. సీటమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి మాట్లాడుతూ సాంకేతిక మార్పులు అనుగుణంగా విద్య, నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు.

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇంద్రేష్, శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతుశిరీష, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు. చిత్తూరు జిల్లా జడ్జి అరుణసారిక, ఏఈవో రవీంద్రబాబు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ



బాధితులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే జగన్మోహన్

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు బాధితులకు మంజూరైన రూ.16.25 లక్షల సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ శుక్రవారం పంపిణీ చేశారు. చిత్తూరు రూరల్ మండలం ఎగువ కండ్రిగకు చెందిన మానస (బోన్ న్యూరోకి సంబంధించి చికిత్సకోసం)కు రూ.9.75 లక్షలు, చిత్తూరు నగరానికి చెందిన గిరిధర్ (లివర్ సంబంధిత వ్యాధి చికిత్సకోసం)కు రూ.6.50 లక్షల చెక్కులను అందజేశారు. టీవీ రెడ్డి కాలనీలోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో నేతలు రఘు, శ్యామ్, మేషాక్, మోహన్‌రాజ్, కంద, పచ్చయప్ప, మునిరత్నం తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ప్రశంస



నింద్ర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో నగరి క్రీడాకారులు ప్రతిభ చూపారని స్థానిక బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ ఎం.వి.రవిబాబు తెలిపారు. ఈ ఏడాది సబ్ జూనియర్స్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన లక్ష్మీ నరసింహారెడ్డిని, జిల్లా స్థాయిలో ప్రతిభ చూపిన తేజేష్, ఇజాజ్, రితి, జశ్వంత్, సిద్ధ తదితరులను శుక్రవారం అసోసియేషన్ కార్యాలయంలో సన్మానించారు. అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి నిజాం, డాక్టర్ ఆర్.వి.మంజుల పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో విద్యార్థి పాత్ర కీలకం : ఏఎస్పీ



విద్యార్థినికి జ్ఞాపిక అందజేస్తున్న ఏఎస్పీ రాజశేఖర్‌రాజు

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సమాజాభివృద్ధిలో విద్యార్థి పాత్ర కీలకమైందని ఏఎస్పీ రాజశేఖర్‌రాజు అన్నారు. రుక్మిణి క్రిష్ణస్వామి డిగ్రీ కళాశాలలో కరస్పాండెంట్ డీకే బద్రినారాయణ, ప్రిన్సిపాల్ రమేష్‌బాబు అధ్యక్షతన ఫ్రెషర్స్‌డేని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. గురువులను గౌరవించే, తల్లిదండ్రులను ప్రేమించే, దేశంపై భక్తి చూపే విద్యార్థి జీవితంలో అత్యున్నత శిఖరాలు చేరుకుంటాడన్నారు. సీటమ్స్ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటాచలపతి మాట్లాడుతూ సాంకేతిక మార్పులు అనుగుణంగా విద్య, నైపుణ్యాలు పెంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆటపాటలు, నాటికలు అలరించాయి. కార్యక్రమంలో రామచంద్రయ్య, శ్రీరాములురెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

యాదమరిలో ఉపాధ్యాయ దినోత్సవం



యాదమరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ ఆధ్వర్యంలో యాదమరిలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు కనకాచారి, జిల్లా ప్రధాన కార్యదర్శి విజయభాస్కర్ రెడ్డి, చిత్తూరు అర్బన్ సీనియర్ నాయకుడు వేణుగోపాల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం భాస్కర్‌రావుతోపాటు 10 మంది ఉపాధ్యాయులను సత్కరించారు.

చట్టాలపై అవగాహన సదస్సు



బాలికకు విద్యాసామగ్రిని అందజేస్తున్న డీఎస్పీ అజీజ్

వెదురుకుప్పం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చట్టాలపై అవగాహన సదస్సును వెదురుకుప్పం బాలికల వసతి గృహంలో శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన నగరి డీఎస్పీ అజీజ్ మాట్లాడుతూ.. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే పోలీసుల దృష్టికి తేవాలని బాలికలకు సూచించారు. అనంతరం బాలికలకు విద్యాసామగ్రిని అందజేశారు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

టిడ్కో గృహాలను లబ్ధిదారులకు కేటాయించండి

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): టిడ్కో గృహాలను వెంటనే లబ్ధిదారులకు కేటాయించకుంటే పోరాటం తప్పదని ఏపీ మహిళా సమాఖ్య నాయకులు హెచ్చరించారు. శుక్రవారం సమాఖ్య కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. లబ్ధిదారుల వద్ద డిపాజిట్లు సేకరించి ఏళ్లు గడుస్తున్నా గృహాలను కేటాయించక పోవడం సరికాదన్నారు. నాయకులు జమిలాబీ, విజయగౌరి, కోమల, రాజేశ్వరి, జ్యోతి పాల్గొన్నారు.

'కార్వేటినగరాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలి'

వెదురుకుప్పం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం మండలాన్ని తిరుపతి జిల్లాలో చేర్చాలంటూ టీడీపీ నాయకులు, స్థానికులు కోరారు. పుత్తూరుకు వెళుతున్న తుడా చైర్మన్ దివాకరరెడ్డిని శుక్రవారం కార్వేటినగరంలో ఆపి ఈ మేరకు వినతిపత్రమిచ్చారు. ఇప్పటికే తుడా పరిధిలో కార్వేటినగరం ఉందన్న విషయాన్ని గుర్తు చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చెంగ్రాలయయాదవ్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు మేళం రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గాంబ దసరా ఉత్సవాలకు ఆహ్వానం

చిత్తూరు కల్చరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గిరింపేట దుర్గాంబ ఆలయంలో దసరా ఉత్సవాలు ఈనెల 22వ తేదీనుంచి జరగనున్నాయి. ఈ సందర్భంగా ఉత్సవాలకు రావాలంటూ ఆలయ ఈవో తిమ్మారెడ్డి, మాజీ పాలకమండలి చైర్మన్ విశ్వనాథ్‌ల బృందం శుక్రవారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌ను స్వగృహంలో కలిసి ఆహ్వాన పత్రిక అందజేశారు. అక్కడే ఉన్న ఎమ్మెల్యే తండ్రి చెన్న కేశవులు నాయుడికి అమ్మవారి ప్రసాదాలు అందజేశారు.

ఇవి సిమెంటు రోడ్లే..!



మాధవరం, తెల్లగుంటలో సిమెంట్ రోడ్ల దుస్థితి

విజయపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాధవరం, తెల్లగుంట గ్రామాల్లో సిమెంటు రోడ్లు చూస్తుంటే మట్టి రోడ్లకంటే అధ్వానంగా తయారయ్యాయి. తేలికపాటి వర్షం కురిస్తే రోడ్లపై నీరు నిలుస్తోంది. పైగా కొన్నిచోట్ల గుంతలు ఉండటంతో రోడ్లన్నీ బురదమయంగా మారాయి. నడవడానికి కూడా వీల్లేకుండా ఉందని, నీటి నిల్వ కారణంగా దోమలు పెరిగి రోగాలు వస్తున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

పెనుమూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెనుమూరు, ఉగ్రాణంపల్లె, మఠంపల్లె సబ్‌స్టేషన్ల పరిధిలో మరమ్మతులు చేస్తున్నట్లు ఏఈ తులసిప్రసాద్ తెలిపారు. ఈ కారణంగా ఆయా సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం తొమ్మిది మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

10నుంచి 'ఈశా' యోగా కార్యక్రమం

చిత్తూరు రూరల్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈనెల పది నుంచి 16వ తేదీవరకు ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో యోగా కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ ప్రతనిధి పుష్ప తెలిపారు. ఆదివారం మినహా రోజూ ఉదయం,సాయంత్రం ఆరు నుంచి తొమ్మిది గంటల వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆదివారం ఉదయం ఏడు నుంచి సాయంత్ర ఐదు గంటల్లోపు 73374 84259, 93478 94741 నెంబర్లకు ఫోన్ చేసి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.





నీడ కూడా లేకుండా వారపు సంత నిర్వహణ - రోడ్డుకు ఇరువైపులా వారపు సంత దుకాణాలు

మౌలిక వసతులెక్కడ?

పచ్చికాపల్లం వారపు సంతలో ఇబ్బంది పడుతున్న జనం, వ్యాపారులు

వెదురుకుప్పం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పచ్చికాపల్లం వారపు సంత నిర్వహణకు మౌలిక వసతుల్లేక ఇటు జనం, అటు వ్యాపారులు ఇబ్బంది పడుతున్నారు. పచ్చికాపల్లం సుమారు 47 గ్రామాలకు కూడలి కావడంతో ప్రజలు ఎక్కువగా వస్తుంటారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం సంత కోసం కేటాయించిన స్థలంలో నిలువడానికి నీడ కూడా లేకపోవడం ఇబ్బందికరంగా మారింది. మరోవైపు తిరుపతి, చిత్తూరు, పుత్తూరు, పళ్లిపట్టు ప్రాంతాలకు కూడలి కావడంతో వాహనాల రాకపోకలూ ఎక్కువగానే ఉంటాయి. ఇటువంటి రోడ్డుపైన కూడా సంత పెట్టడంతో ట్రాఫిక్ సమస్యతోపాటు ప్రమాదమూ పొంచి ఉంది. ఇకనైనా అన్ని వసతులూ కల్పించాల్సి ఉందని స్థానికులు కోరుతున్నారు.









వరసిద్ధుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా యాగశాలలో పూర్ణాహుతి నిర్వహిస్తున్న ధర్మేశ్వర్ గురుకుల్ - వసంతోత్సవంలో ఈవో, భక్తులు - ఆస్థాన మండపంలో కళాకారిణుల నృత్యాభినయం - త్రిశూల స్నానం

వరసిద్ధుడి సేవలో ప్రముఖులు



ఆలయంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డితో ఈవో పెంచలకిషోర్ తదితరులు

ఐరాల(కాణిపాకం), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాణిపాక వరసిద్ధుడిని శుక్రవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వీరిలో.. కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఇంద్రేష్, శ్రీకాకుళం జిల్లా పలాస నియోజకవర్గం ఎమ్మెల్యే గౌతుశిరీష, తిరుపతి కలెక్టర్ వెంకటేశ్వర్, రాష్ట్ర గ్రీన్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ సుగుణమ్మ, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుబ్బారెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరందరినీ ఈవో పెంచలకిషోర్ ఆలయ మర్యాదలతో ఆహ్వానించి.. స్వామి దర్శన ఏర్పాట్లు చేశారు. చిత్తూరు జిల్లా జడ్జి అరుణసారిక, ఏఈవో రవీంద్రబాబు, సూపరింటెండెంట్ కోదండపాణి, ఆలయ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు పాల్గొన్నారు.



వరసిద్ధుడి ఏకాంత సేవ పూజల్లో పాల్గొన్న ఆలయ ఈవో, సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, భక్తులు

మామిడి రైతులను ఇబ్బంది పెట్టొద్దు

- గుజ్జు ఫ్యాక్టరీ యాజమాన్యాలకు టీడీపీ నేతల సూచన



మీడియాతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

గుడిపాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మామిడి రైతులను ఇబ్బంది పెట్టొద్దని గుజ్జు ఫ్యాక్టరీల యాజమాన్యాలకు టీడీపీ నాయకులు సూచించారు. శుక్రవారం ఫుడ్ ఇన్స్ ఫ్యాక్టరీని టీడీపీ మండల అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం నాయుడు, సింగిల్‌విండో అధ్యక్షుడు ప్రతాప్‌నాయుడు, జిల్లా టీడీపీ నేత వెంకటేశ్ యాదవ్ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను కచ్చితంగా అమలు చేయాలని చెప్పారు. కొందరికి కిలోకు రూ.7, మరికొందరికి రూ.6 ఇవ్వనున్నారని తమ దృష్టికి వచ్చిందన్నారు. అలా చేస్తే మార్కెటింగ్ యాక్టు ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ప్రధాన కార్యదర్శి బాలసుబ్రహ్మణ్యం యాదవ్, టీడీపీ నేతలు శరత్, రవినాయుడు, శంకర్ చౌదరి, నాగరాజ, రెడ్డెప్ప, మోహన్‌రాజ్, నిత్యానందం, జయచంద్ర, గిరి, తదితరులు పాల్గొన్నారు.

గురువులకు సన్మానం



పెనుమూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మంచి, చెడులను నేర్పించే ప్రతి ఒక్కరూ గురువులేనని విశ్రాంత జడ్జి గుర్రప్ప తెలిపారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా తమ గురువులైన పట్నం మునిరత్నం, జగన్నాథం, నాగరాజు, చంద్రయ్యలకు శుక్రవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద సన్మానించారు. దళిత నాయకులు దాము, నాగరాజు, చంద్ర, వెంకటేశ్, ధనరాజ్, మురళి, బొడెయ్య తదితరులు పాల్గొన్నారు. ● ఎమ్మార్సీ భవనంలో జరిగిన వేడుకల్లో ఎంఈవో భాస్కర్‌నాయుడు, రాజేంద్రలను టీచర్లు సన్మానించారు.

నేత్రవైద్య ఉచిత శిబిరం

యాదమరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జోడిచింతలలోని సుచి స్వచ్ఛంద సంస్థ కార్యాలయంలో శుక్రవారం నేత్రవైద్య ఉచిత శిబిరం నిర్వహించారు. 40 మంది రోగులను పరీక్షించి, 20 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశారు. వీరిని చెన్నై శంకర్ నేత్రాలయ ఆస్పత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేయిస్తామని స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు పాల్ విజయ్‌కుమార్ గ్లోరి తెలిపారు. చెన్నై శంకర నేత్రాలయ ఆస్పత్రి వైద్యులు మురళీకృష్ణ, సుచి సిబ్బంది వరదరాజ్, జాన్సన్, జాకబ్, యోవాన్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

పాలసముద్రం, సెప్టెంబరు 5 (ఆంధ్రజోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి చెందారు. ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తెలిపిన వివరాల మేరకు.. గంగమాంబాపురం ఆది ఆంధ్రవాడలోని రోడ్డుపక్కన ఉన్న చింతచెట్లను గత ఆదివారం కోస్తున్నారు. ఆ సమయంలో బైక్‌పై తమిళనాడులోని షోలింగర్‌కు వెళుతున్న గంగమాంబపురం కాలనీకి లక్ష్మణ్, అశోక్‌పై చెట్ల కొమ్మలు పడ్డాయి. బైక్‌పై వెనుక కూర్చొని ఉండిన లక్ష్మణ్‌కు తీవ్ర గాయాలవడంతో కుటుంబీకులు వేలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. చెట్లను కొనుగోలు చేసిన తమిళనాడు వ్యాపారి బలరామ్, బైక్ నడిపిన అశోక్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు.

ద్రౌపది అమ్మవారికి పూజలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరంలోని ద్రౌపది అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారిని సుందరంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్షుడు మేళం రవియాదవ్ పర్యవేక్షించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక చేయూత



అక్బర్, ఇస్మాయిల్‌కు చెక్కులు అందజేస్తున్న సీపీవో శ్రీనివాసరావు

యాదమరి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 14 కండ్రిగ ముస్లింవాడకు చెందిన ఇస్మాయిల్, అక్బర్ అలీలు ఎనిమిది నెలల క్రితం రాయిపనికి వెళ్లగా ఒక బ్లాస్టింగ్ ప్రమాదంలో ఇద్దరూ కంటిచూపు కోల్పోయారు. వీరి కష్టాలను చూసి చిత్తూరు పార్లమెంటు తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లేరు అమర్‌నాథ నాయుడు చలించారు. వెంటనే కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టర్.. బాధితులకు చెరో రూ.50వేలను మంజూరు చేశారు. దీనికి సంబంధించిన చెక్కులను శుక్రవారం తన కార్యాలయంలో సీపీవో శ్రీనివాసరావు అందజేశారు. బాధితులతోపాటు అమర్‌నాథనాయుడు, టీడీపీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షుడు మునీర్ ఉన్నారు. ఈ సందర్భంగా అమర్‌నాథ నాయుడు మాట్లాడుతూ.. ఇదే ప్రమాదంలో కంటిచూపుతోపాటు కుడిచేయిని మణికట్టు వరకు కోల్పోయిన మునీరాకు కూడా కలెక్టర్ గత నెలలో రూ.లక్షను అందజేశారని గుర్తుచేశారు. తనవంతుగా మునీరా పిల్లలను చదువుల బాధ్యత తీసుకున్నానని తెలిపారు. ఎమ్మెల్యే మురళీమోహన్‌తో కలిసి బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు.

ఉపాధ్యాయుల క్రికెట్ పోటీలు



క్రికెట్ పోటీల్లో పాల్గొన్న ఉపాధ్యాయులు

నింద్ర, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయదినోత్సవాన్ని పురస్కరించుకుని నింద్ర, నగరి, విజయపురం మండలాలకు చెందిన ఉపాధ్యాయులు శుక్రవారం క్రికెట్ పోటీలు నిర్వహించుకున్నారు. కేవీకే మైదానంలో జరిగిన ఈ పోటీల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

చామంచిపురం ప్రాజెక్టు నిర్మాణం కలేనా?



ప్రాజెక్టు నిర్మించాలనుకున్న మంగదానగుట్ట, యనమలగుట్ట, ఊరగుట్ట

ఐరాల, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఐరాల మండలంలోని చామంచిపురం వద్ద గత ప్రభుత్వం రూ.1,200 కోట్లతో ప్రాజెక్టు నిర్మించనున్నట్లు ప్రజలకు హామీ ఇచ్చింది. తర్వాత ఆ ఊసే లేదు. చామంచిపురం గ్రామం సమీపంలోని మంగదానగుట్ట, ఊరగుట్ట, యనమలగుట్టను కలుపుతూ ఈ ప్రాజెక్టును నిర్మించాలనుకున్నారు. అయితే పనులు చేయకుండా రైతులను మోసం చేశారు. ఈ ప్రాజెక్టు సుమారు 12 కిలోమీటర్ల దూరం విస్తీర్ణం ఉంటుంది.

2వేల హెక్టార్లకు సాగునీరు: ఈ ప్రాజెక్టు పూర్తయితే సుమారు రెండువేల హెక్టార్లకు సాగునీటిని సరఫరా చేయవచ్చు. ప్రాజెక్టు నిర్మాణం వల్ల ఐరాల, పూతలపట్టు, పెనుమూరు, జీడీనెల్లూరు మండలాలకు సాగునీటి ఇబ్బంది పూర్తిగా తొలగిపోతుంది. జిల్లా కేంద్రమైన చిత్తూరుకు తాగునీటి సమస్య తీరుతుంది. సగం జిల్లా సస్యశ్యామలంగా మారుతుందని స్థానికులు చెబుతున్నారు.

అర్ధగిరిలో హైకోర్టు న్యాయమూర్తి

తవణంపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అర్ధగిరి వీరాంజనేయస్వామి ఆలయాన్ని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి సుబ్బారెడ్డి కుటుంబ సమేతంగా శుక్రవారం దర్శించుకున్నారు. అర్చకులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం కల్పించారు. చిత్తూరు జిల్లా జడ్జి అరుణ సారిక, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

ఘనంగా గురుపూజోత్సవం

శ్రీరంగరాజపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):ఎస్ఆర్‌పురం ఎమ్మార్సీలో గురుపూజోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉత్తమ ఉపాధ్యాయులు కె.దీనావతి, ఎన్.హేమలత, కె.శివకుమార్‌లను ఎంఈవోలు అరుణాచాలంరెడ్డి, సబర్మతి సన్మానించారు.

రేపు అర్ధగిరి ఆలయం మూత

తవణంపల్లె, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ చంద్రగ్రహణం కారణంగా ఆదివారం సాయంత్రం ఐదు నుంచి సోమవారం ఉదయం ఐదు గంటల వరకు అర్ధగిరి ఆలయం మూత వేయనున్నట్లు ఈవో హనుమంతరావు తెలిపారు. దేవస్థానంలో పౌర్ణమి సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలన్నీ రద్దు చేశామన్నారు. భక్తులు గమనించాలని సూచించారు. సోమవారం ఉదయం ఆలయ శుద్ధి, సంప్రోక్షణ నిర్వహించాక స్వామి దర్శనానికి భక్తులను అనుమతిస్తామని పేర్కొన్నారు.

ఉద్యోగ విరమణ సన్మానం

పాలసముద్రం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాలసముద్రం ఏఎస్ఐగా పనిచేస్తూ ఉద్యోగ విరమణ పొందిన మునస్వామిని నగరి డీఎస్పీ అజీజ్ శుక్రవారం సన్మానించారు. కార్వేటినగరం సీఐ హనుమంతప్ప, ఎస్ఐ చిన్నరెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రదోష కాల పూజలు

వెదురుకుప్పం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్వేటినగరం సమీపంలో ఉన్న శిష్ట సౌందర్యవల్లి సమేత సదాశివేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం సాయంత్రం ప్రదోష కాల పూజలను నిర్వహించారు. సదాశివేశ్వరుడికి, నందీశ్వరుడికి ఏకకాలంలో పూజలు చేశారు.

యువకుడి అదృశ్యం



హేమచంద్ర

బంగారుపాళ్యం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడి అదృశ్యంపై కేసు నమోదైంది. ఎస్ఐ ప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. పెరుమాళ్లపల్లె గ్రామానికి చెందిన రంగనాథం కుమారుడు హేమచంద్ర(21) మూడ్రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఈ మేరకు శుక్రవారం రాత్రి హేమచంద్ర తండ్రి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నాగాలమ్మ ఆలయ వార్షికోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఓం శ్రీ శక్తి నాగాలమ్మ దేవాలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మురకంబట్టు బైపాస్ రోడ్డు, ఇందిరమ్మ కాలనీలో ఉన్న ఆలయంలో విఘ్నేశ్వర, కలశ, నవగ్రహ పూజలు జరిగాయి. భక్తులకు అన్నదానం చేశారు.

చిత్తూరు నియోజకవర్గ టీడీపీ కమిటీల ప్రకటన

చిత్తూరు సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నియోజకవర్గ టీడీపీ కమిటీలను లక్ష్మీనగర్‌కాలనీలోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ గురువారం రాత్రి ప్రకటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్టీ కోసం కష్టపడి పనిచేస్తున్న వారిని గుర్తించి, సీనియర్‌నేతల అభిప్రాయాలతోనే కమిటీలను నియమించామన్నారు.

కమిటీలు ఇలా..: చిత్తూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడిగా శశినాయకర్, ప్రధాన కార్యదర్శిగా చందురెడ్డి, ఉపాధ్యక్షుడిగా సిసింద్రీ, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా లీలావతి, ప్రధాన కార్యదర్శిగా ఉదయ, ఉపాధ్యక్షురాలిగా దేవి, ఐటీడీపీ అధ్యక్షుడిగా కిరణ్ చౌదరి, ప్రధాన కార్యదర్శిగా చందు చెరుకూరి, బీసీ సెల్ అధ్యక్షుడిగా నిత్యానందం, ప్రధాన కార్యదర్శిగా మార్కొండ యాదవ్, ఉపాధ్యక్షుడిగా రాధాకృష్ణ, రైతు విభాగం అధ్యక్షుడిగా కాశి, ప్రధాన కార్యదర్శిగా రవినాయుడు, ఉపాధ్యక్షుడిగా గుర్రప్ప, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా బస్సు రమేష్, ప్రధాన కార్యదర్శిగా ఎల్.బాబు, మైనార్టీ సెల్ విభాగం అధ్యక్షుడిగా జాఫర్ షరీఫ్, ప్రధాన కార్యదర్శిగా ఖమాల్, ఉపాధ్యక్షుడిగా గౌస్, వాణిజ్యవిభాగం అధ్యక్షుడిగా గోపాల్, ప్రధాన కార్యదర్శిగా గిరి నాయుడు, క్రిస్టియన్ సెల్ విభాగం అధ్యక్షుడిగా కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా సత్య, ఉపాధ్యక్షుడిగా విల్సన్ లను ఎంపిక చేశారు. మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, కాజూరు బాలాజి, క్లస్టర్ ఇన్‌చార్జిలు, కమిటీల సభ్యులు పాల్గొన్నారు.